## మీకు తెలుసా?







- ❒ ఆకుకూరలు, కూరగాయలను బాగా కడిగిన తర్వాతే ముక్కలుగా కోసి వండుకోవాలి.
- ❒ ఆకుకూరలను, కూరగాయలను ముక్కలుగా కోసిన తరవాత కడిగితే వాటిలోని పోషక పదార్థాలన్నీ నశిస్తాయి.
- ❒ అన్నం వండే ముందు బియ్యాన్ని ఎక్కువగా కడగకూడదు.
- ❒ అన్నం వండేటపుడు గంజి వార్చకుండా వండాలి. వార్చితే దాంట్లోని పోషక పదార్థాలు పోతాయి.
- ❒ ప్రతి రోజూ తినే ఆహారంలో పప్పు, ఆకుకూరలు ఉండేటట్లు చూసుకోవాలి.
- ❒ కూరగాయలు, పప్పు లాంటివి ఎక్కువగా ఉడికించకూడదు.
- ❒ క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, దోసకాయ, ఉల్లిపాయ, కొత్తిమీర, పుదీనాలను వండకుండ తినవచ్చు.


## కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. ఆహారం | 2. వండి తినేవి | 3. వండకుండా తినేవి |
| 4. జీర్ణం | 5. వంటపాత్రలు | 6. పోషకపదార్థాలు |


## మనం నేర్చుకున్నవి

- ★ ఆహారంవల్ల మనకు శక్తి లభిస్తుంది.
- ★ మొక్కలనుండి, జంతువులనుండి మనకు ఆహారం లభిస్తుంది.
- ★ కొన్ని ఆహారపదార్థాలను వండి, మరికొన్నింటిని వండకుండా తింటాం.
- ★ వండడం వల్ల ఆహారం రుచిగా ఉంటుంది. తొందరగా జీర్ణమవుతుంది.
- ★ ఒకే ఆహారపదార్థాన్ని అందరూ ఒకే విధంగా వండరు.
- ★ వంటకు కుక్కర్, ఓవెన్ వంటివాటిని ఇప్పటి కాలంలో వాడుతున్నారు.
- ★ అన్ని ఆహార పదార్థాలనూ ఒకేలా వండరు. ఉడకబెట్టడం, వేయించడం, కాల్చడం ఇలా రకరకాలుగా వండుతారు. ఆహారపదార్థాలను వండడానికి రకరకాల వంటపాత్రలు కావాలి.
- ★ వండే ముందు కూరగాయలను, ఆకుకూరలను బాగా కడగాలి.





## ఇవి చేయండి



### విషయావగాహన

1. ఆహారం తినకపోతే ఏమవుతుంది?

2. వండకుండా తినేవాటికి ఉదాహరణలివ్వండి.

3. కిందివాటిని వర్గీకరించి పట్టికలో రాయండి.

   పూరీ, సపోటా, ఖర్జూరం, గుడ్డు, కోడిమాంసం, బెండకాయ, చేపలు, బాదంపప్పు, చెరుకు, వంకాయ, బత్తాయి, పాయసం, నిమ్మరసం, మామిడికాయ, కంద, బచ్చలి, పాలకూర, కొత్తిమీర, జీడిపప్పు, మిరపకాయలు, అరటికాయ, జామకాయ, పుచ్చకాయ, బంగాళదుంప, ఉల్లిపాయ, చిలకడదుంప.

| వండి తినేవి | వండకుండా తినేవి |
|---|---|
| | |

4. వండి, వండకుండా రెండు విధాలుగా తినేవి ఏవి?

5. బియ్యం, గోధుమలతో చేసే ఆహారపదార్థాల పేర్లు రాయండి.

6. మీ ఇంట్లో ఏయే వంటపాత్రలు ఉన్నాయి?



### బొమ్మలు గీసి రంగులు వేయండి.

1. మీ ఇంట్లో అన్నం దేంట్లో వండుతారు. అట్లాగే కూరలు, బజ్జీలు దేంట్లో చేస్తారు? వాటి బొమ్మలు గీయండి.

2. మీ కిష్టమైన పండ్ల బొమ్మలు గీసి రంగులు వేయండి.





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మీ మిత్రులలో ముగ్గురిని అడిగి నిన్నటి రోజున ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఏమి తిన్నారో వివరాలు సేకరించండి. పట్టికలో నమోదు చేయండి.

| క్ర.సం. | మిత్రుని పేరు | ఉదయం తిన్నవి | మధ్యాహ్నం తిన్నవి | రాత్రి తిన్నవి |
|---|---|---|---|---|
| | | | | |

- అందరూ తిన్న ఆహార పదార్థమేది?
- రాత్రి ఎక్కువమంది తిన్న ఆహార పదార్థమేది?
- ఉదయం తిననివాళ్ళెందరు?

2. మీ ఇంట్లో అన్నం / పప్పు / కూర ... ఇలా ఏదైనా ఒక ఆహారపదార్థాన్ని ఎలా వండుతారో పరిశీలించండి. దేని తరువాత ఏం చేశారో చార్టుమీద రాసి తరగతి గదిలో ప్రదర్శించండి.



## ప్రశ్నించడం

1. మేరి రజనీవాళ్ల ఇంటికి వెళ్లింది. వాళ్లమ్మ వంట చేయడం చూసింది. రజనీవాళ్ల అమ్మ చేస్తున్న వంటను గురించి మేరీ రకరకాల ప్రశ్నలు అడిగింది. ఆమె ఏమేమి ప్రశ్నలు అడిగి ఉండవచ్చు? రజనీవాళ్ల అమ్మ కూరగాయలను గురించి రకరకాల సూచనలు ఇచ్చింది. ఆమె ఏమి సూచనలు ఇచ్చి ఉండవచ్చు?




## నేనివి చేయగలను




| | | |
|---|---|---|
| 1. | ఆహారాన్ని ఎందుకు తినాలో వివరించగలను. | ఔను / కాదు |
| 2. | ఆహారాన్ని వండి తినేవి, వండకుండా తినే పదార్థాలుగా వర్గీకరించగలను. | ఔను / కాదు |
| 3. | వివిధ వంటపాత్రల, కూరగాయల చిత్రాలను గీయగలను. | ఔను / కాదు |
| 4. | వంటచేసే క్రమాన్ని వివరించగలను. | ఔను / కాదు |
| 5. | పోషక పదార్థాలు నశించకుండా ఆహారాన్ని ఎలా వండాలో చెప్పగలను. | ఔను / కాదు |
| 6. | ఆహారపదార్థాలను గురించి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |







# 8. ఆహారపు అలవాట్లు



దసరా సెలవులలో బడి పిల్లలందరూ విహారయాత్రకు హైద్రాబాద్ వెళ్ళారు. అక్కడ వేరు వేరు ప్రాంతాలనుంచి వచ్చిన పిల్లలందరూ కలిశారు. వారందరికీ స్నేహం కుదిరింది. జూపార్కులో అనేక రకాల జంతువులను చూసారు. మధ్యాహ్నం కాగానే పిల్లలందరూ ఒక చోటికి చేరారు. ఇంటిదగ్గరనుంచి తెచ్చుకున్న డబ్బాలు తీసుకుని ఆహారం తింటున్నారు. వాళ్లేం తింటున్నారో చూద్దామా!




ఎవరెవరు ఏమేమి తింటున్నారో తెలుసుకున్నారు కదా!
మరి మీ ప్రాంతంలో ఏయే ఆహార పదార్థాలు తింటారు?




తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



మన రాష్ట్రంలో కొండప్రాంతాల్లోను, అటవీప్రాంతాల్లోను నివసించేవాళ్లు అడవిలో దొరికే రకరకాల దుంపలు, తునికిపండ్లు, ఉసిరి, జామపండ్లు, అల్లనేరేడుపండ్లు, ఉడుగుపండ్లు మొదలైనవాటిని తింటారు. అక్కడ పండే పంటలు, లభించే ఆహారపదార్థాల ఆధారంగా వాళ్ల వాళ్ల ఆహారపు అలవాట్లు ఉంటాయి.

రాజస్థాన్ రాష్ట్రంలో జొన్నలు ఎక్కువగా పండుతాయి. వాళ్లు జొన్నరొట్టెలు తింటారు. అట్లే ఢిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహారు మొదలయిన రాష్ట్రాలలో గోధుమలతో చేసిన రొట్టెలు, పూరీలు ఎక్కువగా తింటారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో వరి అన్నం తింటారు. కేరళ రాష్ట్రంలో వరి అన్నంతో పాటు చేపలు కూడా ఎక్కువగా తింటారు.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆహారపు అలవాటు ఉంటుంది. అదే విధంగా వివిధ సందర్భాలలో వివిధ రకాల వంటలు వండుకుని తింటారు. పండుగలప్పుడు, పెళ్ళిళ్ళప్పుడు, పుట్టినరోజులప్పుడు, స్థానికంగా జరుపుకొనే జాతరల సమయంలో రకరకాల వంటలు చేసుకుంటారు.

ఎప్పుడెప్పుడు ఏ రకమైన వంటకాలు తింటారో రాయండి.

| పండుగలు / పెళ్లిళ్లు / ప్రత్యేక సందర్భాలు | వండే రకరకాల వంటకాలు |
|---|---|
| | |

మీ మిత్రులను అడిగి వాళ్లు ఏయే రకాల వంటకాలు చేసుకుంటారో రాయండి.



పిల్లలందరూ తినడం పూర్తయ్యాక జంతువులను చూడసాగారు.

**శరత్ :** సుజాతా! అదిగో ఆ పావురాలను చూడు. గింజలు తింటున్నాయి.

**సుజాత :** ఔను. పావురాలన్నీ ఒకచోట చేరి తింటున్నాయి!









**రఘు** : అలీ! అదిగో ఏనుగు చూడు. ఏం తింటున్నదో!


**అలీ** : అమ్మో! ఏనుగు పెద్ద పెద్ద చెరుకు గడలను తొండంతో తీసి నోట్లో పెట్టుకొని చకచకా తింటోంది. ఇంకా మిగిలిన జంతువులను చూద్దాం పదండి.




మీకు తెలిసిన జంతువులు ఏయే ఆహారపదార్థాలను తింటాయో కింది పట్టికలో రాయండి.



| జంతువు / పక్షి పేరు | తినే ఆహారం |
|---|---|
| ఆవు | గడ్డి |



మన చుట్టూ అనేక రకాల జంతువులు, పక్షులు ఉన్నాయి. మనలాగే వాటికి కూడా ఆహారం అవసరం. జంతువులన్నీ ఒకే రకమైన ఆహారం తీసుకోవు. వాటికి రకరకాల ఆహారపు అలవాట్లు ఉంటాయి. జంతువులు, పక్షులు రకరకాల ఆహార పదార్థాలను తింటాయి. గింజలు, మొక్కలు, మాంసం, తేనె, పాలు... ఇలా రకరకాల ఆహారాన్ని తీసుకొంటాయి.



సోనీవాళ్ల ఇంట్లో వాళ్ల అమ్మ, నాన్న, అన్నయ్య ఉంటారు. వాళ్లు ఎలా భోజనం చేస్తున్నారో చూడండి.



రంగయ్య వాళ్ల ఇంట్లో వాళ్ల అమ్మ నాన్నతో పాటు, మామయ్య కూడా ఉంటాడు. వాళ్లు ఎలా భోజనం చేస్తున్నారో చూడండి?



పై రెండు చిత్రాలూ చూశారు కదా! సోని ఇంట్లో వాళ్లు ఎలా భోజనం చేస్తున్నారు?


రంగయ్యవాళ్ల ఇంట్లో ఎలా భోజనం చేస్తున్నారు?

ఏ రకంగా భోజనం చేయడం మంచిది? ఎందుకు?

కుటుంబ సభ్యులందరూ ఎప్పుడెప్పుడు కలిసి తింటారు? ఎందుకు కలిసి తినాలి?








పండుగకు సోనీవాళ్ల ఇంటికి బంధువులు వచ్చారు. బంధువులందరికీ ఒకేసారి భోజనాలు ఏర్పాటు చేశారు. వీరికి సోనీవాళ్ల అన్నయ్య, నాన్న వడ్డించారు. ఈ చిత్రం చూడండి.



పై చిత్రంలోలాగ ఎప్పుడెప్పుడు ఎక్కువమంది కలిసి తింటారు?

ఎక్కువమంది కలిసి తినేటప్పుడు మీరైతే ఏ పనులు చేస్తారు?

సాధారణంగా పెళ్ళిళ్ళు, పుట్టిన రోజు వేడుకలు, పండుగల సమయంలో అందరూ కలిసి తింటారు.కలిసి తినడంవల్ల మనమంతా ఒక్కటే అనే భావన కలుగుతుంది.



## అందరూ అన్నీ తినగలరా?

మహేశ్ బడినుంచి ఇంటికి వచ్చేటప్పుడు కాల్చిన మొక్కజొన్న కంకి ఒకటి కొని తెచ్చాడు. ఇంటికి రాగానే ఉయ్యాలలో ఉన్న తమ్మునికి మొక్కజొన్న కంకి తినిపించబోయాడు. చిన్న పిల్లలకు కంకి తినిపించకూడదు అంది అమ్మ. అయితే తాతయ్యకు ఇస్తానని పరుగెత్తుకుంటూ తాతయ్య దగ్గరకు వెళ్లాడు. కంకి తిను తాతయ్యా! అన్నాడు. తాతయ్య నాకొద్దు, నేను తినలేను అన్నాడు.

తమ్మునికి మొక్కజొన్న కంకి తినిపించోద్దని అమ్మ ఎందుకు చెప్పింది?

తాతయ్య కంకిని ఎందుకు తినలేనన్నాడు?

మీ ఇంట్లో మొక్కజొన్న కంకిని ఎవరెవరు తినగలరు?



చంటిపిల్లలు, ముసలివాళ్ళు ఇంకా వేటిని తినలేరు. ముసలివాళ్లు ఏమేమి తినగలరు? చంటి పిల్లలు ఏమేమి తినగలరు?

| | తినగలిగినవి | తినలేనివి |
|---|---|---|
| చంటిపిల్లలు | | |
| ముసలివాళ్లు | | |
| ఇతరులు | | |

చిన్నపిల్లలకు దంతాలు ఉండవు. నమిలి తినలేరు. కాబట్టి పాలు తాగిస్తారు. మెత్తటి ఆహారాన్ని పెడతారు. అలాగే దంతాలులేని ముసలివాళ్లు గట్టి వస్తువులు నమలలేరు. ఇలా వయస్సునుబట్టి కూడా ఆహారపు అలవాట్లలో తేడాలుంటాయి. మంచి ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో మంచి అలవాట్లు ఉండడం కూడా అంతే ముఖ్యం. తినేముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు, కాళ్లు కడుక్కోవాలి. తిన్న తరవాత ఆ స్థలాన్ని శుభ్రం చేయాలి.

## కీలక పదాలు

1. కలిసి తినడం
2. ఆహారపదార్థాలు
3. ఆహారపు అలవాట్లు
4. కాళ్లూ చేతులూ కడుక్కోవడం

## మనం నేర్చుకున్నవి

★ ఒక ప్రాంతంలో ఆహారపు అలవాట్లు అక్కడ పండే పంటలు, లభించే ఆహార పదార్థాలపై ఆధారపడి ఉంటాయి.

★ పండుగలు, పెళ్ళిళ్ల సమయంలో ప్రత్యేకమైన వంటలు వండుకుంటారు.

★ జంతువులకు, పక్షులకు కూడా ఆహారం అవసరం. వీటికి రకరకాల ఆహారపు అలవాట్లు ఉంటాయి.

★ ఇంట్లో వాళ్లందరూ కలిసి తినాలి. దీనివల్ల అందరూ అన్ని ఆహారపదార్థాలను తగినంతగా తినే అవకాశముంటుంది. కలిసి తింటే సంతోషంగా ఉంటుంది.

★ వయస్సునుబట్టి ఆహారపు అలవాట్లు మారుతుంటాయి.

★ తినడానికి ముందు కాళ్లు చేతులు సబ్బుతో కడుక్కోవాలి.





## ఇవి చేయండి

### విషయావగాహన

1. మీ ప్రాంతంలో ఎక్కువమంది ఏయే ఆహారపదార్థాలు తింటారు?
2. గడ్డి తినే జంతువులు, గింజలు తినే జంతువులకు ఉదాహరణలివ్వండి.
3. ఆహారం చాలా విలువైనదికదా! దాన్ని వృథాకాకుండా చూడాలంటే మనమేంచేయాలి?
4. కుక్క ఆహారపు అలవాట్లకు, మేక ఆహారపు అలవాట్లకు మధ్య తేడాలేమిటి?
5. అందరూ కలిసి భోజనం చేయడం ఎందువల్ల మంచిది?
6. ఈ కింది ఆహారపు అలవాట్లు మీకు ఉంటే '✓' చేయండి.

- ఆహారం తినేముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కుంటాను. ☐
- తినేముందు, తరువాత కంచాన్ని శుభ్రంగా కడుగుతాను. ☐
- తినేటప్పుడు ఆహారపదార్థాలను నేలమీద పడనియ్యను. ☐
- ఆహారపదార్థాలు ఉండే పాత్రలమీద మూతలు ఉంచుతాను. ☐
- ఆహారపదార్థాలను వృథా చెయ్యను. ☐
- రోడ్లమీద, అపరిశుభ్రమయిన చోట్ల అమ్మే పదార్థాలను కొనను, తినను. ☐
- అందరితో కలిసి తింటాను. ☐

### బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. కింది బొమ్మను చూడండి. గీయండి. దాని గురించి రాయండి.






తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ




## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మీ మిత్రులు ఐదుగురిని అడిగి వాళ్లు ఇంట్లో ఎప్పుడెప్పుడు కలిసి భోజనం చేస్తారో పట్టికలో '✓' చేయండి.

| క్ర.సం. | మిత్రుని పేరు | ఎప్పుడు కలిసి భోజనం చేస్తారు? | | |
|---|---|---|---|---|
| | | ఉదయం | మధ్యాహ్నం | రాత్రి |
| | | | | |

ఎవరెవరి ఇళ్లలో ఎక్కువసార్లు కలిసి తింటున్నారు? ఎప్పుడు కలిసి తింటారు?



## ప్రశంస

1. మీ తరగతిలో ఎవరెవరు ప్రతి రోజూ తినే ముందు కాళ్లూ చేతులూ కడుక్కుంటున్నారు? అట్లాగే కంచంలో ఏమీ మిగలకుండా, కింద పడకుండా ఎవరెవరు శుభ్రంగా తింటున్నారు? తిన్న తరవాత ఆ స్థలాన్ని శుభ్రంగా ఉంచుతున్నారా? మీరైతే ఏం చేస్తారు?



## ప్రశ్నించడం

1. గోపి మధ్యాహ్నం పాఠశాలలో చేతులు, కాళ్లు కడుక్కోకుండానే భోజనం చేయడానికి కంచం తీసుకొని వచ్చాడు. గోపిమిత్రులు గోపిని చేతులూ, కాళ్లూ కడుక్కోమని చెప్పారు. గోపివాళ్ల మిత్రుల్ని ప్రశ్నలు అడిగాడు. ఆ ప్రశ్నలు ఏమై ఉంటాయి? అవి సరైనవేనా? మీరైతే గోపికి ఏమి చెప్తారు?



## నేనివి చేయగలను



1. ప్రాంతాలనుబట్టి ఆహారపు అలవాట్లు వేరుగా ఉంటాయని తెలుసుకొన్నాను. ఔను / కాదు
2. జంతువుల, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి చెప్పగలను. ఔను/ కాదు
3. ఇంట్లోవాళ్లందరూ కలిసి తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించగలను. ఔను / కాదు
4. తినే ఆహారపదార్థాల పట్టిక తయారుచేయగలను. ఔను / కాదు
5. మంచి ఆహారపు అలవాట్లను వివరించగలను, పాటించగలను. ఔను / కాదు
6. ఆహారపు అలవాట్లను గురించి ప్రశ్నించగలను. ఔను / కాదు






# 9. మన గ్రామం



రంగాపురం చుట్టూ చిన్న, చిన్న కొండలు ఉంటాయి. గ్రామానికి దగ్గరలో నది ప్రవహిస్తుంది. గ్రామానికి నదినీరే ఆధారం. గ్రామంలో ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. గ్రామంలో నీళ్ళట్యాంకు ఉంది. నీళ్ళను నల్లాల ద్వారా వదులుతారు. గ్రామంలో అనేక పనులు చేసేవాళ్లు ఉన్నారు. ఇపుడు రంగాపురం గ్రామచిత్రాన్ని పరిశీలిద్దామా!



పై చిత్రం ఒక గ్రామానికి (పల్లెటూరికి) సంబంధించినదని ఎందుకనవచ్చు?


పై చిత్రం ఆధారంగా గ్రామం అంటే ఏమిటో చెప్పండి?

పై చిత్రంలో ఉండేవాటి గురించి మాట్లాడండి?






రంగాపురం గ్రామం ఎలా ఉన్నదో చిత్రంలో చూసారు కదా! రంగాపురం గ్రామంలో ఇంకా ఏమేమి ఉన్నాయో కింది చిత్రంలో చూడండి. చెప్పండి.



రంగాపురం గ్రామంలో ఏమేమి ఉన్నాయి?

మీ గ్రామంలో ఏమేమి ఉన్నాయి?



రంగాపురం గ్రామంలో వీధులు, రకరకాల ఇళ్ళు, బడి, గుడి, మసీదు, చర్చి, గ్రామ పంచాయితి, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, పశువైద్యశాల, పాఠశాల, పోస్టాఫీసు ఉన్నాయి కదా! వీటిని గురించి మీకు తెలుసా?



## గ్రామపంచాయితి కార్యాలయం లేదా గ్రామ సచివాలయం

ఇది రంగాపురం గ్రామపంచాయితి కార్యాలయం. గ్రామపంచాయితి వారు గ్రామానికి మంచినీటి సరఫరా చేయడం,వీధులు, కాలువలు శుభ్రం చేయడం, వీధి దీపాలు వేయడం లాంటివి చేస్తుంటారు.

మీ ఊరి పంచాయితీవారు ఏఏపనులుచేస్తారు.






## పోస్టాఫీసు




ఇది తంతి-తపాల కార్యాలయం. దీనిద్వారా ఉత్తరాలను చేరవేయడం, డబ్బు దాచుకోవడం, జీవితబీమా మొదలయిన పనులు చేస్తారు.

> మీ ఊరిలోని పోస్ట్‌బాక్స్ చూశారా? దానిలో ఏమేమి వేస్తుంటారు?
>
> పోస్ట్‌మాన్ ఏ ఏ పనులు చేస్తాడు? ఆయన పేరు ఏమిటి?

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం




గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంది. ఈ కేంద్రంలో వైద్యుడు, ఆరోగ్య కార్యకర్తలుంటారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్య విషయాలను గురించి తెలుపుతూంటారు. పల్స్ పోలియో కార్యక్రమాలు నిర్వహిస్తారు. చిన్నచిన్న రోగాలకు మందులు ఇస్తూంటారు.

> మీ గ్రామంలో పోలియో చుక్కలు ఎవరు వేస్తారు?
>
> మీ గ్రామంలో ఆరోగ్యకేంద్రం ఉందా? అది ఏ ఏ పనులు చేస్తుంది?

## పశువైద్యశాల




మనకు రోగాలు వచ్చినప్పుడు ఆసుపత్రికి ఎలా వెళతామో, అలాగే పశువులకు రోగాలు వచ్చినపుడు వాటిని పశువుల ఆసుపత్రికి తీసుకెళతారు.

> పశువులను ఎప్పుడెప్పుడు ఆసుపత్రికి తీసుకెళతారో అడిగి రాయండి.
>
> పశువైద్యశాల లేకపోతే ఏమవుతుంది?



## బ్యాంకు

రంగాపురం గ్రామంలో జనాభా ఎక్కువగా ఉండడం వల్ల గ్రామీణ బ్యాంకు కూడా ఉంది. ప్రజలు డబ్బును బ్యాంకులో దాచుకుంటారు. ప్రజల అవసరాలకు బ్యాంకులు అప్పులు కూడా ఇస్తాయి. వాటిని వాయిదాల రూపంలో తిరిగి చెల్లిస్తూ ఉంటారు.

> పెద్దవారిని అడిగి బ్యాంకులవల్ల ఇంకా ఏమేమి లాభాలు ఉన్నాయో తెలుసుకొని చెప్పండి.




### పాఠశాల



రంగాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నది. ఇక్కడ చదువు పూర్తిచేసినవారు పై చదువుల కొరకు పొరుగు గ్రామానికి వెళతారు.

> పాఠశాల లేకపోతే ఏమవుతుంది?
>
> మీ గ్రామంలో పై చదువులకు ఎక్కడికి వెళతారు?

### నీళ్ళట్యాంకు



నీళ్ళ ట్యాంకుల ద్వారా నీటిని నల్లాలకు వదులుతారు. నీళ్ళట్యాంకును వారానికి ఒకసారి కడుగుతారు. నీళ్ళలో క్లోరిన్‌ను కలిపి శుద్ధిచేసి నల్లాలకు వదులుతారు. నీటిని వృధా చెయ్యగూడదు. నల్లా నుంచి నీరు వృధాపోకుండా చూడాలి. నీరు వృధా అవుతున్నా, పైపుల్లో లీకేజీ ఉన్నా వెంటనే గ్రామ సర్పంచ్‌కు తెలియచెయ్యాలి.

> మీ గ్రామంలో నీటిని ఎక్కడినుంచి తెచ్చుకుంటారు?
>
> నీళ్ళట్యాంకు ఉపయోగమేమిటి?

### ప్రార్థనా మందిరాలు

కింది చిత్రం చూడండి. ఏమేమి ఉన్నాయి? వీటికి ఎవరెవరు వెళతారు? ఎప్పుడెప్పుడు వెళ్తారు?



ఇలాగే మీ గ్రామంలో ఏమేమి ఉన్నాయి? వాటికి ఎవరెవరు వెళతారు? ఎప్పుడెప్పుడు వెళతారు?







## రంగాపురం గ్రామానికి రాకపోకలు

మనం ఏదైనా ఊరికి వెళ్లాలంటే బస్సు, రైలు, ఆటోలలో వెళతాం. మరి రంగాపురం గ్రామానికి రాకపోకలు ఎలా ఉంటాయో తెలుసుకుందామా! రంగాపురం గ్రామంలో ఏయే వాహనాలు ఉన్నాయో చెప్పండి.



రంగాపురం గ్రామానికి ఉదయం, సాయంత్రం బస్సు వస్తుంది. దగ్గరి ప్రాంతాలకు ఆటోలో వెళతారు. ఊరిలో వ్యవసాయదారులు ఎడ్లబండిని పొలం పనులకు వాడుతూంటారు. పాఠశాల విద్యార్థులు పై చదువుల కొరకు పొరుగు గ్రామానికి బస్సులో వెళ్ళి వస్తూ ఉంటారు.

> మీ గ్రామానికి ఏయే వాహనాలు వస్తూంటాయి?
>
> మీ గ్రామంలో వాళ్లు ఏయే వాహనాలలో ప్రయాణంచేస్తారు?

రంగాపురం గ్రామంలో ఉన్న సామాజిక సంస్థలు, ప్రయాణ సాధనాలను గురించి తెలుసుకున్నారు కదా!



మరి ఆ గ్రామంలోవాళ్లు ఏయే పనులు చేస్తారో తెలుసా? ఎక్కువ మంది వ్యవసాయం చేస్తారు. కొంతమంది కూలిపనులు చేస్తారు. ఇంకా గ్రామంలో రకరకాల పనులు చేసేవాళ్లున్నారు. కమ్మరి, కుమ్మరి మొదలయిన వృత్తులవాళ్లు కూడా ఉన్నారు. అలాగే గ్రామాలలో బాగా చదువుకొని ఉద్యోగాలు చేసేవాళ్లు కూడా ఉన్నారు. మరికొంతమంది చిన్నచిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారం చేస్తారు. బడి ఈడు పిల్లలందరూ ఆ ఊరి బడిలోనే చదువుకుంటారు. పెద్ద పిల్లలు పొరుగూరికి వెళ్లి పై చదువులు చదువుకుంటున్నారు. గ్రామంలోని ఆడవాళ్లు కూడా అందరూ చదువుకున్నవారే! వాళ్లుకూడా ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించుకొంటున్నారు.

**మీ గ్రామంలో ఏ ఏ పనులు చేసేవారున్నారు?**

రంగాపురం గ్రామంలో ఏమి ఉన్నాయో తెలుసుకున్నారు కదా! ఇలాంటి సౌకర్యాలు అన్ని గ్రామాలలో ఉండకపోవచ్చు. అన్ని సౌకర్యాలూ ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది.

## కీలక పదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | గ్రామం | 2. | గ్రామ పంచాయతీ | 3. | బ్యాంకు |
| 4. | పశువైద్యశాల | 5. | ప్రాథమిక ఆరోగ్య కేంద్రం | 6. | పోస్టాఫీసు |
| 7. | ఆరోగ్య కార్యకర్త | 8. | ప్రార్థనామందిరాలు | 9. | రవాణా సౌకర్యాలు |
| 10. | సామాజిక సంస్థలు | 11. | జీవితబీమా | 12. | పోలియో చుక్కలు |

## మనం నేర్చుకున్నవి

- ★ సాధారణంగా గ్రామంలో గ్రామపంచాయతి, బ్యాంకు, పశువైద్యశాల, పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోస్టాఫీసు, గుడి, మసీదు, చర్చి ఉంటాయి.
- ★ గ్రామపంచాయతి మురికి కాలువలు శుభ్రం చేయించడం, వీధిదీపాలు వేయడం, చెత్తను తీసివేయడం, మంచినీటి సరఫరా చేయడం లాంటి పనులు చేస్తుంది.
- ★ గ్రామంలో బ్యాంకు, పోస్టాఫీసు, బడి, ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, గ్రామ పంచాయతి వంటి సంస్థలు ఉండడంవల్ల ఎంతో మేలు జరుగుతుంది.
- ★ గ్రామాలకు రవాణా మార్గాలు ఉంటాయి. వివిధ రకాల రవాణా సాధనాలు వచ్చి వెళుతుంటాయి.
- ★ గ్రామంలో వివిధ రకాల పనులు చేసేవాళ్లు ఉంటారు.





## ఇవి చేయండి




### విషయావగాహన

1. రంగాపురం గ్రామంలో ఏమేమి ఉన్నాయి?
2. మీ ఊర్లో / వాడలో ఉన్న ప్రార్థనామందిరాల పేర్లు రాయండి.
3. మీ గ్రామంలో బడి లేకుంటే ఏమౌతుంది?
4. గ్రామంలో బ్యాంకు ఉంటే కలిగే లాభాలు ఏమిటి?
5. బ్యాంకు, పోస్టాఫీసుల మధ్య పోలికలు భేదాలు రాయండి.



### బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. పాఠశాల బొమ్మ గీయండి. రంగులు వేయండి.





### సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టుపని

2. రంగాపురం గ్రామంలో ఏమేమి ఉన్నాయో కిందిపట్టికలో రాయండి. వాటిలో మీ గ్రామంలో ఉన్న వాటికి '✓' పెట్టండి.

| | రంగాపురం గ్రామంలో ఉన్నవి | మీ గ్రామంలో ఉన్నవి |
|---|---|---|
| 1. | | |
| 2. | | |
| 3. | | |
| 4. | | |
| 5. | | |
| 6. | | |



- రంగాపురం గ్రామంలో ఉన్నవాటిలో, ఏవి మీ ఊరిలో ఉన్నాయి?
- రంగాపురం గ్రామంలో ఉండి మీ ఊరిలో లేనివి ఏవి?
- రంగాపురం గ్రామంలో లేకుండా మీ ఊరిలో ఉన్నవి ఏవి?


3. మీ గ్రామంలోని సామాజిక సంస్థల పేర్లు, అవి చేసే పనులను తెలుసుకొని చెప్పండి, రాయండి.

| క్ర.సం. | సామాజిక సంస్థలు | అవి చేసే పనులు |
|---|---|---|
| | | |



## ప్రశంస

1. గ్రామంలో బడి, బ్యాంకు, పోస్టాఫీసు, వైద్యశాల మొదలయినవి ఉంటే ఏయే లాభాలు ఉన్నాయో తెలుసుకున్నారు కదా! వాటి సేవల గురించి నీవు ఏమనుకుంటున్నావు?



## ప్రశ్నించడం

1. చిన్నయ్య రంగాపురానికి వెళ్లాడు. రంగాపురం గురించి తెలుసుకోవాలనుకున్నాడు. ఇందుకు బడికి వెళ్లి ఉపాధ్యాయులను కలిశాడు. ఊరిని గురించి అడిగాడు. చిన్నయ్య ఏమేమి ప్రశ్నలు అడిగాడు. ఉపాధ్యాయులు ఏమేమి జవాబులు చెప్పి ఉంటారు.



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | గ్రామం అంటే వివరించగలను. | ఔను / కాదు |
| 2. | గ్రామంలోని సామాజిక సంస్థలు అవి చేసే పనులు గురించి వివరించగలను. | ఔను / కాదు |
| 3. | మా ఊరిలో / గ్రామంలో ఉన్న సంస్థల వివరాలతో పట్టిక తయారుచేయగలను. | ఔను / కాదు |
| 4. | గ్రామంలోని సంస్థల ఉపయోగాలు తెలుసుకొన్నాను. వాటిని ఉపయోగించుకోగలను. | ఔను / కాదు |
| 5. | పాఠశాల బొమ్మ గీసి రంగులు వేయగలను. | ఔను / కాదు |
| 6. | గ్రామం గురించి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |






# 10. రకరకాల ఇళ్లు



మనందరికీ ఉండడానికి ఇళ్లు అవసరం. ఎండ, వాన, చలి, దుమ్ము, ధూళి మొదలయిన వాటినుంచి రక్షణ పొందడానికి ఇళ్లలో నివాసం ఉంటాం. మనలాగే పక్షులు, జంతువులు కూడా నివాసాలను ఏర్పాటుచేసుకుంటాయి. అయితే మనం నివసించే ఇళ్లన్నీ ఒకేలా ఉంటాయా? ఒకరోజు సాయంత్రం పొలంనుంచి అమ్మా నాన్నలతో కలసి సంతోష్, సరళ ఇంటికి వస్తున్నారు. సరళ, సంతోష్ దారిపక్కనే ఉన్న కొండ ఎక్కారు. కొండపైనుంచి గ్రామంలోని ఇళ్లను చూశారు. అవి ఎలా కనిపించాయో, ఏయే రకాల ఇళ్లు ఉన్నాయో చూద్దామా!






ఇళ్లన్నీ ఒకే రకంగా ఉన్నాయా? ఏ యే రకాల ఇళ్లు ఉన్నాయి?

గ్రామంలోని ఇళ్లన్నీ పక్కపక్కనే ఉన్నాయా? లేక దూరదూరంగా ఉన్నాయా?

సరళ గ్రామంలోని ఇళ్లు ఎలా ఉన్నాయో తెలిసింది కదా! గ్రామంలో రకరకాల ఇళ్లు పక్క పక్కనే ఉండడం చూశారు కదా! మరి మీ ఊళ్లో కూడా ఇళ్లు ఇలాగే ఉన్నాయా? మీ ఊళ్లో ఏ ఏ రకాల ఇళ్లు ఉన్నాయో రాయండి. గ్రామంలో ఇళ్లన్నీ పక్కపక్కనే ఉండడంవల్ల కలిగే లాభం ఏమిటి?






తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## తాత్కాలిక నివాసాలు

సంతోష్ బడికి వచ్చాడు. సంతోష్ దిగులుగా ఉండడం జోసెఫ్ చూశాడు. 'ఎందుకు అలా ఉన్నావు?' అని జోసెఫ్ అడిగాడు. 'రాత్రి గాలివాన వచ్చింది కదా! మా గుడిసెలన్నీ పడిపోయాయి' అని సంతోష్ చెప్పాడు. 'అయితే ఇప్పుడు మీరు ఎక్కడ ఉంటున్నారు?' అని జోసెఫ్ అడిగాడు. 'మాకోసం ఊరి బయట డేరాలు వేశారు' అని సంతోష్ చెప్పాడు. మీరెప్పుడైనా డేరాలు చూశారా? వాటిని ఎప్పుడు చూశారు? ఎందుకోసం వేసి ఉంటారు? ఆలోచించండి.




ఊరూరా సంచారంచేసేవాళ్లు, సర్కస్‌వాళ్లు తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుంటారు. వరదలు, తుఫాన్‌లు, సునామీలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటివి చోటుచేసుకున్నప్పుడు ఇళ్లు కోల్పోయినవాళ్లకు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేస్తారు.



సంతోష్ వాళ్ల మామయ్య పెళ్లికి పట్టణానికి వెళ్లాడు. రోడ్డు పక్కన ఉన్న పెద్ద పెద్ద పైపులను చూశాడు. వెళ్లేదారిలో అందులో కొందరు నివాసం ఉంటున్నారు. అది చూసి సంతోష్‌కు ఆశ్చర్యం కలిగింది. ఇలా పైపుల్లో కూడా నివాసం ఉంటారా? అను కున్నాడు. 'పైపుల్లో ఎందుకు నివసిస్తున్నారు?' అని వాళ్ల మామయ్యను అడిగాడు. వాళ్ల మామయ్య ఏం చెప్పి ఉంటాడో ఆలోచించండి.








దేరాల్లో, పైపుల్లో నివాసం ఉండేవారికి ఏయే సౌకర్యాలు ఉండవో రాయండి.

దేరాలు, పైపులు వంటి తాత్కాలిక నివాసాల్లో ఉండేవారికి ఏయే ఇబ్బందులు ఉంటాయి?

కరువు వచ్చినప్పుడు, ఊళ్లో పనులు లేకపోయినపుడు కొంతమంది ఉపాధికోసం పట్టణాలకు వలసపోతుంటారు. ఇలా పట్టణాలకు వెళ్లినవారికి ఉండడానికి ఇళ్లు ఉండవు. వీళ్లు కొంతమంది దారి పక్కన ఖాళీగా కనిపించే పైపుల్లోగాని, ఖాళీస్థలాల్లో దేరాలు వేసుకుని లేదా గుడిసెలు వేసుకుని గాని తాత్కాలికంగా నివాసం ఉంటారు.




సంతోష్ పట్టణంలో పెద్ద భవనాన్ని చూశాడు? 'అమ్మో! ఎంత ఎత్తుగా ఉందో! దీంట్లో ఎవరుంటారు? అని మామయ్యను అడిగాడు. పట్టణాల్లో స్థలం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఉన్న స్థలంలోనే ఎక్కువ కుటుంబాలు నివాసం ఉండడానికి వీలుగా ఇలాంటి పెద్దపెద్ద భవనాలు కడతారు. వీటిని అపార్ట్‌మెంట్లు అంటారని మామయ్య సంతోష్‌కు చెప్పాడు.




ఇలాంటివి మీరెప్పుడైనా చూశారా?

అపార్ట్‌మెంట్లు నగరాల్లో ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఒక కుటుంబం ఒక ఇంట్లో ఉంటుంది. అపార్టుమెంట్లో అనేక కుటుంబాలు ఉంటాయి. ఇందుకనుగుణంగా అపార్టుమెంట్లు కడతారు. ఒక కుటుంబం నివాసం ఉండే స్థలాన్ని ఫ్లాట్ అంటారు.

ఒక అపార్ట్‌మెంట్లో సుమారు 10 నుంచి 30 కుటుంబాల వరకు నివాసం ఉండడానికి ఫ్లాట్లు ఉంటాయి. పెద్ద నగరాల్లో 100 వరకు ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్లు కూడా ఉన్నాయి.






తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



డేరాలు, పైపులు, అపార్ట్‌మెంట్ల గురించి తెలుసుకున్నారు కదా! ఈ కింది చిత్రాలు చూడండి. వీటిలో మీ ఇల్లు ఏ రకమైనదో చెప్పండి.





మరి మీ మిత్రులు ఉండే ఇళ్లు ఎలాంటివో తెలుసా మీకు? మీ మిత్రులను అడగండి. ఎలాంటి ఇళ్లల్లో నివసిస్తున్నారో కింది పట్టికలో రాయండి.

| మిత్రుని పేరు | ఇల్లు రకం |
|---|---|
| 1 | |
| 2 | |
| 3 | |
| 4 | |
| 5 | |

మీలాగే మీ మిత్రులు కూడా పట్టిక తయారు చేశారు కదా! వాళ్లను అడిగి మీ తరగతిలో ఎంతమంది ఏ రకమైన ఇళ్లలో నివసిస్తున్నారో తెలుసుకోండి. ఎక్కువమంది ఏ రకమైన ఇళ్లలో నివసిస్తున్నారో చెప్పండి.

### మీకు తెలుసా?



ఇది కలపతో కట్టిన ఇల్లు. భూకంపాలు వచ్చే ప్రాంతాల్లో ఉంటాయి.




ఇది పడవ ఇల్లు. కాశ్మీర్, కేరళ రాష్ట్రాల్లో ఇలాంటి ఇళ్లు ఉన్నాయి.



ఇది 'ఇగ్లూ'. మంచు ప్రాంతాల్లో ఉంటుంది. దీన్ని మంచుతో కట్టు కుంటారు.










## ఇండ్ల పైకప్పులు

ఇండ్ల గురించి తెలుసుకున్నారు కదా!

ఇంటి పైకప్పు అంటే మీకు తెలుసా! ఇంటికి పైన ఉండే భాగాన్ని ఇంటి పైకప్పు అంటారు. కొన్ని ఇండ్ల పైకప్పు చిత్రాలు కింద ఉన్నాయి చూడండి.









అన్ని ఇండ్ల పైకప్పులూ ఒకేలా ఉన్నాయా? కొన్ని ఏటవాలుగా ఉన్నాయి కదా! మరికొన్ని ఇళ్ల పైకప్పులు బల్లలాగా చదునుగా ఉంటాయి. మరి మీ గ్రామం / వాడలోని ఇళ్ల పైకప్పులు ఎక్కువగా ఎలా ఉన్నాయో చెప్పండి.



## చేసి చూడండి

**ఇళ్ల పైకప్పులు ఎందుకు ఏటవాలుగా ఉంటాయో తెలుసా?**

మూడు రేకులు లేదా పలకలు లేదా లావుపాటి గట్టి అట్టను తీసుకోవాలి. ఒకదాన్ని నేలపైన ఉంచండి. రెండవ దాన్ని ఒక ఇటుకకు ఆనించి ఉంచండి. మూడో దాన్ని రెండు ఇటుకలపై ఆనించి ఉంచండి. ఇలా ఉంచినప్పుడు ఏది ఎక్కువ ఏటవాలుగా ఉంటుంది?




నేలపై ఉంచిన రేకు



ఒక ఇటుకకు ఆనించి ఉంచడం ఉంచిన రేకు.



రెండు ఇటుకలకు ఆనించి ఉంచిన రేకు.



ఇప్పుడు గ్లాసులో నీరు తీసుకోండి. మొదటిదానిపైన పోయండి. తర్వాత రెండోదానిపైన పోయండి. ఆ తర్వాత మూడోదానిపైన పోయండి. దేనిపైన పోసిన నీరు ఎక్కువ తొందరగా కిందికి పోయింది?

**ఎందుకో చెప్పండి.**

పై కప్పులు ఏటవాలుగా ఉండడంవల్ల నీరు వేగంగా కిందకు పోతుంది. అందుకే ఇళ్ల పైకప్పులు ఏటవాలుగా నిర్మిస్తారు. దీనివల్ల వర్షాకాలంలో వాన పడినప్పుడు ఇంటి పైకప్పుపైన పడిన నీళ్లు జారి కిందికి వస్తాయి.

భవనాల పైకప్పులు ఏటవాలుగా ఉండవు కదా! వర్షపునీరు కిందికి ఎలా వస్తుంది?

భవనాలు, అపార్ట్‌మెంట్ల పైకప్పులు చదునుగా కనిపించినా కూడా కొంచెం ఏటవాలుగా ఉంటుంది. వాటిపైన పడే నీళ్లు ఏదో ఒక మూలకు వెళ్లేలా ఏర్పాటు చేస్తారు. అక్కడినుంచి గొట్టాల ద్వారా నీరు కిందకు వెళుతుంది.

మనం నివసించే ఇళ్లు రకరకాలుగా ఉంటాయి. వాటిలో పెంకుటిళ్ళు, గుడిసెలు, డాబాలు, రేకుల ఇళ్ళు వంటివి ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇవి శాశ్వత నివాసాలు. డేరాలు, గుడారాలు, పైపుల వంటి తాత్కాలిక నివాసాల్లో కూడా కొంతమంది నివసిస్తారు. అయితే పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు కూడా ఉంటాయి. అలాగే కొన్ని ప్రాంతాల్లో అక్కడి అవసరాలకనుగుణంగా ఇండ్లను నిర్మించుకుంటారు.

## కీలకపదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ఇళ్ల రకాలు | 2. | సంచారం | 3. | అపార్ట్‌మెంట్ |
| 4. | ఫ్లాట్ | 5. | ఏటవాలు | 6. | ఇళ్ల పైకప్పు |
| 7. | ఇగ్లూ | 8. | పడవ ఇళ్లు | 9. | తాత్కాలిక నివాసం |

## మనం నేర్చుకున్నవి

★ గుడిసెలు, పెంకుటిళ్ళు, రేకుల ఇళ్లు, డాబా ఇళ్ళు, బహుళ అంతస్థుల వంటి రకరకాల ఇళ్ళు ఉంటాయి.

★ వరదలు, తుఫాన్‌లు వచ్చినపుడు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేస్తారు. సంచారం చేసేవాళ్లు, వలస వెళ్ళినవాళ్లు డేరాలవంటి తాత్కాలిక నివాసాల్లో ఉంటారు.

★ నగరాల్లో పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు ఉన్నట్లే కొన్ని ప్రాంతాల్లో మంచుతో కట్టిన ఇళ్లు, కలపతో కట్టిన ఇళ్లు, పడవ ఇళ్లు కూడా ఉంటాయి.

★ ఇళ్ల పైకప్పులు ఏటవాలుగా ఉండడంవల్ల వర్షంనీరు వేగంగా కిందకు జారిపోతుంది.





## ఇవి చేయండి

### విషయావగాహన

1. కింది ఇళ్లలో ఏవి తాత్కాలిక నివాసాలు? ఎందుకు?

   డేరాలు, అపార్ట్‌మెంట్లు, రేకుల షెడ్డు, పైపులలో నివాసం.

2. మీ నివాస ప్రాంతంలో ఉండే రకరకాల ఇళ్లను గురించి చెప్పండి.

3. ఇంటి పైకప్పులు ఏటవాలుగా ఉంటాయి. ఎందుకు?


4. కింది రెండు ఇళ్లలో పోలికలు, భేదాలు చెప్పండి. రాయండి.






### బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. కింది బొమ్మ గీయండి. రంగులు వేయండి.



2. మీ ఇంటిబొమ్మ గీసి రంగులు వేయండి. మీ ఇల్లు గురించి రాయండి..





## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మీ ఇంటి చుట్టుప్రక్కల కొన్ని ఇళ్లను చూడండి. వాటి పైకప్పులు ఎలా ఉన్నాయో కింది పట్టికలో రాయండి.

| క్ర.సం. | ఇంటి రకం | ఇంటి పైకప్పు | |
|---|---|---|---|
| | | చదునుగా | ఏటవాలుగా |
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |
| 5. | | | |
| 6. | | | |

1) ఏ రకమైన ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి? ..................................................

2) ఇళ్ల పైకప్పులు ఎలా ఉన్నాయి? ..................................................

2. బెండ్లు, కాగితాలు, అట్టలు, కర్రపుల్లలు, గడ్డిని ఉపయోగించి ఇంటి నమూనా తయారు చేయండి.



## ప్రశంస

1. గుడారాలు, డేరాలు, పైపుల్లో నివాసం ఉండేవారికి మనం ఎలాంటి సహాయం చేయవచ్చు? మీరు వాళ్లకు ఏమేమి సహాయం చేస్తారు?



## ప్రశ్నించడం

1 సంతోష్ హైదారాబాదులో అపార్ట్‌మెంట్‌లో, పైపుల్లో నివాసం ఉండేవాళ్లను చూశాడు కదా! వాటి గురించి సంతోష్ వాళ్ల మామయ్యను రకరకాల ప్రశ్నలు అడిగాడు. ఆ ప్రశ్నలు ఏమై ఉంటాయి? మీరైతే ఏ ప్రశ్నలు అడుగుతారు?




## నేనివి చేయగలను



1. వివిధ రకాల ఇళ్ల గురించి వివరించగలను. ఔను / కాదు
2. చదునుగా ఉన్న పైకప్పుకు, ఏటవాలు పైకప్పుకు గల తేడాలనుచెప్పగలను ఔను / కాదు
3. వివిధ రకాల ఇళ్ళను గీసి, రంగులు వేయగలను. ఔను / కాదు
4. ఇళ్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పట్టికలో రాయగలను. ఔను / కాదు
5. రకరకాల ఇళ్లను గురించి ప్రశ్నించగలను. ఔను / కాదు





# 11. శుభ్రమైన ఇల్లే అందమైన ఇల్లు




ఒకరోజున రంగయ్య తన స్నేహితుడు కేశవ్‌ను కలవడానికి తన కొడుకు మురళితో కలిసి ఇంద్రవెల్లి గ్రామానికి వెళ్లాడు. అది ఒక ఆదివాసి గ్రామం. ఆ ఊళ్లో రంగయ్యకు తెలిసినవాళ్లు చాలామంది ఉన్నారు. దారి పొడుగునా అందరినీ పలకరిస్తూ కేశవ్ ఇంటికి వెళ్లాడు. "మురళీ! ఇదే కేశవ్ మామయ్య ఇల్లు" ఎలా ఉందో చూద్దామా?



మామయ్య ఇల్లు ఎంతబాగుందో అని కేశవ్ ఎందుకు అన్నాడు?

ఇంటిగోడల మీద ఏం కనిపిస్తున్నాయి?

మీ ఇల్లు కూడా ఇలాగే ఉందా? తేడా ఏమిటి?





రంగయ్య, మురళి నాలుగు రోజుల తర్వాత వాళ్ల ఊరికి తిరిగి వచ్చారు. పాఠశాలలో మురళికి వాళ్ల తరగతిలో కొత్తగా చేరిన జహంగీర్‌తో మంచి స్నేహం కుదిరింది.



జహంగీర్, మురళిని వాళ్ల ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటిముందు పూలమొక్కలు చూసి మురళి ఈ మొక్కలు ఎంత బాగున్నాయో! అన్నాడు. మా ఇంటిచుట్టూ ఇంకా చాలా మొక్కలు ఉన్నాయి అన్నాడు జహంగీర్.



జహంగీర్ ఇంటిముందు ఏమేమి ఉన్నాయి?

చెప్పులు ఎక్కడ ఉన్నాయి?

జహంగీర్, మురళి ఇద్దరు ఇంటి లోపలికి వెళ్ళారు. జహంగీర్ ఇల్లు చూసి మురళికి చాలా ఆనందం కలిగింది. 'మీ ఇల్లు చాలా బాగుంది' అన్నాడు. మురళి ఇలా ఎందుకు అని ఉండవచ్చు?




ఇంట్లో పుస్తకాలు ఎక్కడ ఉన్నాయి? ఎలా ఉన్నాయి?

దుస్తులు ఎక్కడ ఉన్నాయి?


ఇంటిగోడలు ఎలా ఉన్నాయి?







ఆదివారంనాడు మురళి తన అక్క సరితతో కలసి విజయ్‌వాళ్ళ ఇంటికి వెళ్లాడు. విజయ్ ఇల్లు చూడండి.



విజయ్ ఇంటిముందువాకిట్లో పడేసిన ప్లాస్టిక్ సంచులు, చిత్తు కాగితాలు కనిపించాయి. మురళి, సరిత ఇద్దరూ విజయ్ ఇంట్లోకి వెళ్లారు. వాళ్లకి విజయ్ వాళ్ల ఇంటిలోపల ఇలా కనిపించింది.



విజయ్ ఇల్లు ఎలా ఉందో చూశారు కదా! ఇల్లు ఇలాగేనా ఉండాల్సింది! ఆలోచించండి?



విజయ్ ఇంటిముందు తొలగించాల్సినవి ఏవో చెప్పండి. రాయండి?

ఇంటిముందు స్థలాన్ని ఎలా శుభ్రంగా ఉంచుకోవచ్చో చెప్పండి?

చెప్పులు ఎక్కడ ఉన్నాయి? ఎలా సర్దుకోవాలి?

ఇంట్లో ఈగలు, దోమలు ఎందుకు ముసురుకున్నాయి?

దుస్తులు ఎక్కడ ఉన్నాయి? దుస్తులను ఎలా ఉంచుకోవాలి?

పుస్తకాలు, ఆటవస్తువులు ఎలా ఉన్నాయి? మీరైతే ఎలా పెట్టుకుంటారు?

జహంగీర్, విజయ్ ఇళ్లల్లో మీకు ఎవరి ఇల్లు నచ్చింది? ఎందుకు?




మురళీవాళ్ల అమ్మ, నాన్న, అక్క అందరూ కలిసి బంధువుల ఇంట్లో పెళ్లికి ఊరికి వెళ్లారు. వారం తర్వాత తిరిగి వచ్చారు. వాళ్లది ఒకే గది ఉన్న చిన్న ఇల్లు. ఇంటికి వచ్చే సరికి ఇంటిముందు గాలికి కొట్టుకొని వచ్చిన చెత్త కనిపించింది. నేలంతా దుమ్ముతో నిండింది. చీపురుతో ఊడ్చి, వాకిట్లోని చెత్తను ఏరి చెత్తబుట్టలో వేశారు. నీటితో గదిని కడిగారు. అందరూ కలిసి ఇంటిని శుభ్రం చేయడం మొదలుపెట్టారు. సరిత, మురళి కలిసి గదిలో పుస్తకాలను చక్కగా అలమరాలో సర్దినారు.

మొక్కలకు నీరు పోశారు. సరిత టెలివిజన్‌మీద ఉన్న దుమ్ము తుడిచి సర్దిపెట్టింది. మురళీవాళ్ల నాన్న, అమ్మ వంట సామాన్లను సర్దేశారు. వాళ్లు ఎలా సర్దుకున్నారో కింది చిత్రంలో చూడండి.









మురళి, సరితలాగ మీరు కూడా మీ ఇంటిపనులు చేస్తారా?

మీ ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటారా?

చదువుకున్న తరవాత మీ పుస్తకాలను, పెన్నులను, పెన్సిళ్లను ఎక్కడ పెడతారు?

మీ దుస్తులను మీరే సర్దుకుంటున్నారా? లేదంటే ఎవరు సర్దుతారు?

ఇంట్లో చింపేసిన కాగితాలు, పేరుకుపోయిన దుమ్ము కనిపిస్తే మీరేం చేస్తారు?

కొన్ని ఇళ్లు చూడముచ్చటగా ఉంటాయి. కొన్ని ఇళ్లను చూస్తే మరింత మంచిగా సర్దుకోవచ్చు అనిపిస్తుంది. మరికొంతమంది ఇళ్లు చూడగానే మురికిగా ఉన్నాయనిపిస్తుంది. పూరిల్లు, పెంకుటిల్లు, డాబా ఇల్లు ఎలాంటిదైనా సరే! ఇంట్లో వస్తువులను పొందికగా అమర్చుకుంటే శుభ్రంగా, సౌకర్యంగా ఉంటుంది. ఆహ్లాదకరంగాను ఉంటుంది.

మన ఇళ్లలో ప్రతి రోజూ పోగయ్యే మురికి, చెత్త, వ్యర్థపదార్థాలను పారేయకుండా అలాగే వదిలేస్తే ఏమవుతుంది?



ప్రతి ఇంట్లో ఎంతో కొంత చెత్త ఉంటుంది. మీరే చెత్తను ఊడ్చి శుభ్రంచేసుకోవాలి. మన ఇంట్లో ఉన్న మురికి, చెత్త, వ్యర్థ పదార్థాలను ఎక్కడ వేస్తే బాగుంటుందో చెప్పండి. కింది చిత్రాలను పరిశీలించండి.







చిత్రంలో చెత్తను ఎక్కడ వేస్తున్నారు?

చెత్తను ఎక్కడ వేయాలి?

మీ ఇంటి చెత్తను ఎక్కడ వేస్తారు?

మీ వీధిలో చెత్తను ఎప్పుడు, ఎవరు తొలగిస్తారు?



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఇంట్లో పోగయిన చెత్త, వ్యర్థ పదార్థాలను అలాగే వదిలేస్తే దుర్వాసన వస్తుంది. ఈగలు, దోమలు వస్తాయి. అలాంటి ఇల్లు చూడడానికి అపరిశుభ్రంగా ఉంటుంది. మనకు చికాకును, అనారోగ్యాన్ని కలిగిస్తుంది. అందుకే వ్యర్థాలను వెంటనే తొలగించాలి. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి.

## కీలక పదాలు

1. అందమైన ఇల్లు
2. వస్తువులను సర్దిపెట్టుకోవడం
3. ఇంటిని శుభ్రంచేసుకోవడం
4. ఇంట్లోని వ్యర్థపదార్థాలు

## మనం నేర్చుకున్నవి

★ ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, ఇంట్లో వస్తువులను చక్కగా సర్దుకోవడం వల్ల ఇల్లు అందంగా ఉంటుంది.

★ ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేస్తే ఇల్లు అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా మనకు అసౌకర్యంగా కూడా ఉంటుంది.

★ ఇంటిని శుభ్రంగా ఉంచడానికి ఇంట్లోని చెత్తా చెదారం వంటివాటిని చెత్తకుండీలో వేయాలి.

★ మనం ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి అవసరమైన పనులలో సహాయం చేయాలి.

## ఇవి చేయండి



### విషయావగాహన

1. ఇల్లు వేటివల్ల అపరిశుభ్రం అవుతుంది?
2. మీ ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి మీరు చేసిన నాలుగు పనులను చెప్పండి, రాయండి.
3. మీ ఇల్లు అందంగా శుభ్రంగా ఉండాలంటే ప్రతి రోజూ మీరు ఏం చేస్తారో '✓' పెట్టండి.

◆ పుస్తకాలు సర్దుకుంటాను. ☐

◆ నిద్ర లేచాక పక్కబట్టలు తీస్తాను. ☐

◆ చెప్పులను ప్రతిరోజూ అవి ఉండే స్థానంలో పెడతాను. ☐

◆ దుమ్ముతో ఉన్న నేలను ఊడుస్తాను లేదా తుడిచి శుభ్రం చేస్తాను. ☐

◆ గోడల మూలల్లో పోగయ్యే బూజును తొలగిస్తాను. ☐


◆ మొక్కలకు ప్రతిరోజూ నీరు పోస్తాను. ☐

◆ ఇంట్లోని చెత్తను చెత్తకుండీలో వేస్తాను. ☐

◆ ప్లాస్టిక్ బ్యాగులను ఉపయోగించను. ☐

4. ఇంట్లో పోగయిన చెత్తను, మురికిని ఎప్పటికప్పుడు పారేయాలి. లేకుంటే ఏమవుతుంది?
5. శుభ్రమైన ఇల్లే అందమైన ఇల్లు. ఎందువల్ల?







## బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. పాఠం చూడండి. పాఠంలోని అందమైన ఇంటిబొమ్మను గీయండి. రంగులు వేయండి.



## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మీ మిత్రుల ఇళ్లకు వెళ్లండి, వాళ్ల ఇళ్లు ఎలా ఉన్నాయో చూసి కింది పట్టికలో రాయండి.

| | మిత్రుని పేరు | ఇల్లు శుభ్రంగా ఉందా? లేదా? | ఎందువల్ల? |
|---|---|---|---|
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |

ఎవరెవరి ఇళ్లు శుభ్రంగా ఉన్నాయి? ఎందువల్ల? ఎవరెవరి ఇళ్లు శుభ్రంగా లేవు? ఎందువల్ల? ఇళ్లు శుభ్రంగా ఉండాలంటే నువ్వేం చేయాలి?



## ప్రశంస

1. రవి సాయంత్రం పాఠశాలనుంచి ఇంటికి వచ్చాడు. ఇంటిముందు చిందరవందరగా చెప్పులు ఉన్నాయి. ఆరేసిన బట్టలు కిందపడి ఉన్నాయి.ఇవేవీ పట్టించుకోకుండా తన పుస్తకాల సంచిని ఇంట్లో వేసి ఆడుకోడానికి బయటకు వెళ్ళాడు. ఇలా చేయడం సరియైన పనేనా? మీరైతే ఏం చేస్తారు?



## ప్రశ్నించడం

1. మురళి, సరిత, విజయ్‌వాళ్ళ ఇంటికి వెళ్లారు. వాళ్ల ఇల్లు అపరిశుభ్రంగా ఉంది. అపరిశుభ్రంగా ఉన్న ఇంటిని గురించి మురళి, సరిత విజయ్‌ని ఏయే ప్రశ్నలు అడిగి ఉంటారు. విజయ్ ఏమి సమాధానాలు చెప్పి ఉంటాడు.





## నేనివి చేయగలనా?

1. పరిశుభ్రమైన ఇంటికి అపరిశుభ్రమైన ఇంటికి మధ్యగల భేదాలు చెప్పగలను. ఔను / కాదు
2. ఇంటిని శుభ్రంగా ఉంచడానికి నేను కూడా సహాయపడతాను. ఔను / కాదు
3. ఎవరెవరి ఇళ్లు పరిశుభ్రంగా ఉన్నాయి ఎందుకు?
   పట్టిక తయారుచేసి వివరిస్తాను. ఔను / కాదు
4. అందమైన ఇంటి బొమ్మ గీయగలను. ఔను / కాదు
5. అపరిశుభ్రమైన ఇళ్లను గురించి ప్రశ్నలు అడగగలను. ఔను / కాదు





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

# 12. మట్టితో చేసిన మాణిక్యాలు



వినాయక చవితి వచ్చింది. గౌతమివాళ్ల ఇంట్లో వినాయకుని విగ్రహం పెట్టాలనుకున్నారు. అందుకోసం గౌతమి తాతయ్యను వినాయకుని విగ్రహం కొందామని అడిగింది. తాతయ్య, గౌతమి కలిసి విగ్రహం కొనడానికి బజారుకు వెళ్ళారు. దారిలో ఒకచోట మట్టితో చేసిన రకరకాల వినాయకుని విగ్రహాలు కనిపించాయి.

గౌతమి : తాతయ్యా! ఈ టెలిఫోను, రిమోట్ బొమ్మలు చూడండి. ఎంతబావున్నాయో!

తాతయ్య : అవి ప్లాస్టిక్‌తో చేసిన బొమ్మలు.





గౌతమి : తాతయ్యా ఈ ఏనుగు బొమ్మలు చూడండి. ఎంత నున్నగా వున్నాయో!

తాతయ్య : ఇవి కొయ్య బొమ్మలు. మన రాష్ట్రంలోని నిర్మల్ ఈ బొమ్మలకు ప్రసిద్ధి చెందాయి.




గౌతమి : తాతయ్యా ఈ బొమ్మలు చూడండి. ఎంత బావున్నాయో! ఇవి కొందాం తాతయ్యా.

తాతయ్య : ఇవి మట్టితో చేసిన బొమ్మలు. ఇవి అన్నింటికన్నా చౌక. పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించవు.

గౌతమికి ఆ బొమ్మలు చాలా నచ్చాయి. వాటిని కొనుక్కొని ముందుకు కదిలారు. కొంచెం ముందుకు వెళ్లాక అక్కడ దీపాంతలు రకరకాల రంగు రంగుల ఆకారాలలో కనిపించాయి. తాతయ్యా! అవి కూడా కొందాం అంది గౌతమి. 'ఈ దీపాంతలు కూడా మట్టితో చేసినవే, తెలుసా!' అన్నాడు తాతయ్య. గౌతమికి ఆశ్చర్యం వేసింది.








## మీకు తెలుసా?




వినాయకచవితి పండుగకు వినాయకుని ప్రతిమను మట్టితో లేదా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేస్తారు. అయితే మట్టితో చేసిన ప్రతిమనే మనం వాడాలి. ఎందుకంటే మట్టిప్రతిమను నీటిలో వేసినప్పుడు నీళ్ళలో కరిగిపోతుంది. నీరు కలుషితం కాకుండా ఉంటుంది.





మట్టితో బొమ్మలే కాకుండా ఇంకా ఏమేమి చేస్తారో చెప్పండి.

కింది బొమ్మలను చూడండి. వీటిని ఏమంటారు? ఇవి దేంతో తయారు చేశారో తెలుసా? ఎందుకు ఉపయోగిస్తారో చెప్పండి.














ఇలాంటి మట్టితో చేసిన వస్తువులు మీ ఇంట్లో కూడా ఉన్నాయా? వాటి పేర్లు తెలుసుకొని చెప్పండి.



మనం మట్టితో చేసే వస్తువుల గురించి తెలుసుకున్నాం కదా! కుండలు, కూజాలు, రంజను వంటివాటిలో నీటిని నింపుకొని వాడుకొంటాం. వేసవికాలంలో వీటిలోని నీరు చల్లగా ఉంటుంది. మన రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లాలో తయారయ్యే రంజనులు ప్రసిద్ధమైనవి. ఐతే మట్టిపాత్రల్లో వడ్లు, జొన్నలు వంటి ధాన్యాలను కూడా నిలవచేస్తారు. పశువులు నీరు తాగడానికి పెద్దపెద్ద మట్టితొట్టెలను ఉపయోగిస్తారు.

మట్టితో చేసిన దీపాంతల్లో దీపాలు వెలిగిస్తారు. దీపావళి పండుగకు ఇంటింటా దీపాలను రంగు రంగుల దీపాంతల్లో వెలిగిస్తారు. పూలతొట్లలో మట్టిని నింపి చిన్నచిన్న మొక్కలను పెంచుతారు. ఈ పూలతొట్లు కూడా మట్టితో చేసినవే.







ఇలాంటి మట్టిపాత్రలు, కుండలు ఎలా తయారు చేస్తారో మీకు తెలుసా? రాజయ్య మట్టిని తెచ్చి కుండలు తయారుచేస్తాడు. రాజయ్య ఎలా తయారు చేస్తాడో కింది చిత్రాలు చూద్దామా!



కుండలు చేయడానికి రాజయ్య బంకమట్టిని తెస్తాడు.




బంక మట్టిలో నీళ్లు పోసి నానబెట్టి కాలితో చాలాసేపు తొక్కి మెత్తగా చేస్తాడు.




మెత్తని మట్టిముద్దను తీసుకుని కుమ్మరి సారెపైన పెట్టి తిప్పుతాడు. చేతితో కుండ ఆకారాన్ని తయారు చేస్తాడు.



సారెమీద తయారైన కుండను సరైన ఆకారం వచ్చేలా చెక్కతో చేసిన **సలప**తో కొడతాడు.



తయారైన కుండలను మొదట నీడలో ఆరనిచ్చి చివరకు ఎండలో ఆరబెడతాడు.



ఎండకు ఆరిన కుండలను ఆవంలో పెట్టి కాలుస్తాడు.





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఇలా తయారైన కుండలు, కూజాలు, రంజనులు, తొట్లు మొదలయిన వాటిని అంగడిలో లేదా బజారులో అమ్ముతారు. కుండలను కొనేటప్పుడు వాటిపై వేలితో కొడితే టంగ్, టంగ్‌మని చప్పుడు వస్తేనే కొంటారు. అలా ఎందుకు చేస్తారో ఆలోచించండి.



మట్టిపాత్రలు చాలా శ్రేష్ఠమైనవి. మన పూర్వీకులు మట్టిపాత్రలనే అధికంగా వాడేవారు. వీటి ఖరీదు కూడా చాలా తక్కువ.



మట్టితో రకరకాల వస్తువులు తయారుచేస్తారు. వాటిని మనం ఉపయోగించుకుంటాం. గౌతమి ఒకసారి వాళ్ల చుట్టాలు ఇంటికి వెళ్లింది. వాళ్ల ఇంట్లో రకరకాల వస్తువులను చూసింది. ఆ వస్తువులు ప్లాస్టిక్, అల్యూమినియం, మట్టి, ఇనుము, స్టీలు, కర్ర మొదలయిన వాటితో చేసినవి. ఆమె ఏమేమి వస్తువులను చూసి ఉంటుంది? అవి వేటితో తయారైనవో కింది పట్టికలో రాయండి.


| క్ర.సంఖ్య | చూసిన వస్తువులు | అవి వేటితో తయారైనవి '✓' పెట్టండి. | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | స్టీలు | ప్లాస్టిక్ | అల్యూమినియం | మట్టి | కర్ర | ఇనుము |
| 1. | బకెట్ | | ✓ | | | | |
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |
| | | | | | | | |

ఇళ్ళలో వేటితో తయారుచేసిన పాత్రలు ఎక్కువగా వాడుతున్నారు?

ఇళ్ళలో వేటితో తయారుచేసిన పాత్రలు తక్కువగా వాడుతున్నారు?

మట్టిపాత్రల వాడకం ఎందుకు తగ్గింది?





## అబ్బో ఎంత బాగున్నాయో!

గౌతమి వాళ్ల చుట్టాలల ఇంట్లో రకరకాల కూరగాయలను, పండ్లను చూసింది. ఎంత బాగున్నాయో అనుకున్నది. వాటిని తీసుకొని చూసింది. ఆశ్చర్యపోయింది. ఎందుకో తెలుసా! అవన్నీ మట్టితో చేసి, రంగులు వేసినవి. ఆ బొమ్మలను మీరూ చూడండి. వీటిని మీరు కూడా తయారు చేయవచ్చు. బంకమట్టిని తీసుకొని నీళ్లతో కలపండి. మెత్తటి ముద్దగా చేయండి. దాంతో కూరగాయలు, పండ్ల బొమ్మలను తయారు చేయండి. రంగులు వేయండి.



### కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. కొయ్యబొమ్మలు | 2. మట్టిబొమ్మలు | 3. మట్టిపాత్రలు |
| 4. బంకమట్టి | 5. కుమ్మరిసారె | 6. సలప |

### మనం నేర్చుకున్నవి

★ మట్టితో కుండలు, రంజనులు, కూజాలు, పూలతొట్లు, దీపాంతలు మొదలయినవి తయారుచేస్తారు.

★ బొమ్మల కొలువులో మట్టితో చేసిన బొమ్మలను కూడా పెడతారు.

★ వినాయకచవితి పండుగకు మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పెట్టాలి.

★ బంకమట్టితో కుమ్మరి సారెను ఉపయోగించి కుండలను తయారు చేస్తారు.

★ మన పూర్వీకులు మట్టిపాత్రలనే అధికంగా వాడేవారు.


★ ఈ మధ్యకాలంలో మట్టిపాత్రల వాడకం తగ్గింది.


### ఇవి చేయండి



#### విషయావగాహన

1. మట్టితో తయారుచేసే వస్తువులకు మూడు ఉదాహరణలు చెప్పండి, రాయండి.
2. స్టీలుపాత్రలకు, మట్టిపాత్రలకు భేదాలను చెప్పండి, రాయండి.
3. మీ ఇంట్లో మట్టితో చేసిన వస్తువులు ఏమేమి ఉన్నాయి? వాటిని దేనికి ఉపయోగిస్తారు?





## బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. కింది బొమ్మలు గీయండి. రంగులు వేయండి.







## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. బజారుకు వెళ్లి మట్టితో తయారుచేసిన ఏయే వస్తువులు అమ్ముతున్నారో వాటి పట్టిక తయారుచేయండి. అలాగే వాటి ధర ఎంతో తెలుసుకొని రాయండి.

2. మట్టితో రకరకాల కూరగాయలు, పండ్ల బొమ్మలను తయారు చేయండి. వాటికి రంగులు వేయండి.



## ప్రశంస

1. మట్టితో రకరకాల వస్తువులు, బొమ్మలు తయారుచేస్తారని తెలుసుకొన్నారు కదా! ఇలా మట్టితో చేసిన వస్తువులు వాడడం వల్ల కలిగే ఉపయోగాలు ఏమిటి? మట్టితో వస్తువులు తయారుచేసే రాజయ్య లాంటివాళ్లు కలిస్తే మీరు ఎలా అభినందిస్తారు?



## ప్రశ్నించడం

1. మీ తరగతి గదికి మట్టితో కుండలు చేసే రాజయ్య, బొమ్మలు చేసే సీతమ్మ వస్తే మీరు వాళ్లను ఏయే ప్రశ్నలు అడుగుతారు?




## నేనివి చేయగలను



| | | |
|---|---|---|
| 1. | మట్టిపాత్రలకు, ఇతర పాత్రలకు పోలికలు, భేదాలు చెప్పగలను | ఔను / కాదు |
| 2. | మట్టితో కుండలను ఎలా చేస్తారో వివరించగలను. | ఔను / కాదు |
| 3. | మట్టితో రకరకాల కూరగాయలు, పండ్ల బొమ్మలు తయారుచేయగలను. | ఔను / కాదు |
| 4. | మట్టిపాత్రల బొమ్మలు గీసి రంగులు వేయగలను. | ఔను / కాదు |
| 5. | మట్టితో ఏ ఏ వస్తువులను చేస్తారో వివరించగలను. | ఔను / కాదు |
| 6. | మట్టిపాత్రలను, బొమ్మలను గురించి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |





# 13. రంగు రంగుల బట్టలు



అమ్మానాన్నలతో కలిసి లక్ష్మి పండుగకు బట్టలు కొనుక్కోడానికి బజారుకు వెళ్లింది. వాళ్లు అక్కడ బట్టల దుకాణంలో రకరకాల బట్టలు చూశారు. లక్ష్మీవాళ్ల అమ్మానాన్నా లక్ష్మికి, వాళ్ల అన్నయ్యకు కూడా బట్టలు కొన్నారు. అమ్మానాన్నలు కూడా బట్టలు కొనుక్కున్నారు. లక్ష్మీవాళ్ల అమ్మానాన్నలు ఎవరెవరికి ఏయే బట్టలు కొన్నారో ఊహించండి. కింది పట్టికలో రాయండి.

| లక్ష్మికోసం కొన్నవి | లక్ష్మీవాళ్ల అన్నయ్య కోసం కొన్నవి | అమ్మకోసం కొన్నవి | నాన్నకోసం కొన్నవి |
|---|---|---|---|
| | | | |



లక్ష్మి, వాళ్ల అన్నయ్య చిన్న పిల్లలు కదా! వాళ్ల అమ్మా నాన్నలు పెద్దవాళ్లు కదా! వీరందరూ ఒకే రకమైన బట్టలు కొనుక్కున్నారా? వేరువేరు బట్టలు కొన్నారా? కింది బొమ్మలు చూడండి. వీటిలో ఏవి పిల్లలు వేసుకొనేవి? ఏవి పెద్దలు వేసుకొనేవి? చెప్పండి.









చిన్నపిల్లలు వేసుకునే బట్టలు, పెద్దవాళ్లు వేసుకునే బట్టలు వేరువేరుగా ఉంటాయి కదా! మరి మీ ఇంట్లో చిన్నపిల్లలు, మగవాళ్లు, ఆడవాళ్లు వేసుకునే బట్టలు ఏవి? కింది పట్టికలో రాయండి.

| చిన్నపిల్లలు వేసుకునే బట్టలు | మగవాళ్లు వేసుకునే బట్టలు | ఆడవాళ్లు వేసుకునే బట్టలు |
|---|---|---|
| | | |

పై వాటిలో నీకు ఏ దుస్తులు అంటే ఇష్టం? ఎందుకు?



లక్ష్మి కొత్తగౌను వేసుకుని మేరీవాళ్ల ఇంటికి వెళ్లింది. ఈ గౌను బాగుంది. ఎక్కడిది? అని మేరీ అడిగింది. వాళ్లనాన్న షాపులో కొన్నాడని లక్ష్మి చెప్పింది. మేరీ వాళ్ల నాన్న కూడా క్రిస్‌మస్ పండుగకు బట్ట తెచ్చి గౌను కుట్టించాడని చెప్పింది. లక్ష్మి తయారుగా ఉన్న రెడీమేడ్ గౌను వేసుకుంది కదా! మేరీకి వాళ్ల నాన్న బట్ట కొని కుట్టించాడు కదా! ఇలా ఏయే బట్టలను మనం కుట్టించుకొని వేసుకుంటాం? వేటిని కుట్టించకుండానే తయారుగా ఉన్న వాటిని కొనుక్కుంటాం?

మీరైతే ఏ ఏ దుస్తులు కుట్టించుకొంటారు?
కుట్టకుండా నేరుగా కొనుక్కుని ఉపయోగించే బట్టలు ఏవి?

మన శరీరాన్ని ఎండ, వాన, చలి వాతావరణాలనుంచి కాపాడుకోవడానికి బట్టలు వేసుకుంటాం. చలికాలంలో చలినుంచి కాపాడుకోవడానికి, వానాకాలంలో తడవకుండా ఉండడానికి ప్రత్యేకమైన దుస్తులు వేసుకుంటాం. కిందిచిత్రాలు చూడండి. అవి ఎప్పుడు ధరిస్తారో చెప్పండి.







అందరం బట్టలు వేసుకుంటాం. ఇది ఒక ముఖ్యమైన అవసరం. వివిధ ప్రాంతాల వాళ్లు, వివిధ మతాలవాళ్లు వాళ్ల సంప్రదాయాలను బట్టి రకరకాల దుస్తులు ధరిస్తారు. కింది చిత్రాలు చూడండి. వీటిని ఎవరు ధరిస్తారు? వాటి ప్రత్యేకతలు ఏమిటో చెప్పండి?







సాధారణంగా పండుగలు, పెళ్లిళ్లు వంటి సందర్భాలలో ప్రత్యేకంగా ఉండే దుస్తులను ధరిస్తారు. మీరు కూడా పండుగలు, లేదా శుభకార్యాలు లేదా పుట్టినరోజువంటి సందర్భాలలో ఎలాంటి దుస్తులు వేసుకుంటారు? మీ మిత్రులు కూడా మీలాగే వేసుకుంటారా?

బడికి వెళ్లే పిల్లలు బడికి ప్రత్యేకమైన దుస్తులు, అంటే యూనిఫారాలు వేసుకుంటారు కదా! వివిధ వృత్తుల వాళ్లు కూడా పనులు చేసేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులను వేసుకుంటారు. పోలీసులు, డాక్టర్లు, నర్సులు, లాయర్లు, విమానం నడిపే పైలెట్లు, పెద్దపెద్ద హోటళ్లలో వంటలు వండేవాళ్ళు (చెఫ్‌లు) ప్రత్యేకమైన దుస్తులు ధరిస్తారు. కింది చిత్రాలు చూడండి. వీటిని ఏయే వృత్తులవాళ్ళు ధరిస్తారో చెప్పండి.


















బస్సులు నడిపే డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు, కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు, బ్యాంకులు, పెద్ద పెద్ద కంపెనీలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు మొదలయిన వాళ్లు కూడా పనిచేసే సమయంలో ప్రత్యేకమైన దుస్తులను ధరిస్తారు. మనదేశం తరఫున వివిధ ఆటల పోటీలు, క్రీడల్లో పాల్గొనే వాళ్లు కూడా ఆటలాడేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులు వేసుకుంటారు.

మరి మీ ప్రాంతంలో ఇలా ఏయే పనులు చేసేవాళ్లున్నారు? వాళ్లు ఏ యే దుస్తులు ధరిస్తారు.

మనం రకరకాల దుస్తులు వేసుకుంటామని తెలుసుకున్నారు కదా! మనం దుస్తులు వేసుకోవడం ఎంత ముఖ్యమో, శుభ్రమైనవాటిని వేసుకోవడం అంతకంటే ముఖ్యం. తప్పనిసరిగా ప్రతి రోజూ ఉదయం స్నానం చేయగానే ఉతికిన దుస్తులు వేసుకోవాలి. మనం వాడుకునే చేతిరుమాలు (దస్తీ), తువాళ్లు వంటివి కూడా ప్రతి రోజూ ఉతుక్కొని వాడుకోవాలి.

**మీకు తెలుసా?**

నూలు బట్టలను పత్తిదారంతో నేస్తారు. పట్టుపురుగులనుంచి వచ్చే దారంతో పట్టుబట్టలు నేస్తారు.



## గతంలో ఎలాంటి బట్టలు వేసుకునేవారు!

ఇప్పుడు మనం రకరకాల బట్టలు వేసుకుంటున్నాం. వీటిలో కొన్ని కుట్టించుకున్నవి కాగా, మరికొన్ని నేరుగా తయారైనవి. వాటినే రెడీమేడ్ బట్టలుగా కొనుక్కొంటున్నాం. గతంలో అంటే మన తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు వాళ్ల చిన్నప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకునేవారు? అలాగే అమ్మానాన్నలు వాళ్ల చిన్నతనంలో ఏయే దుస్తులు వేసుకునేవారు? అవి ఇప్పుడు చిన్నపిల్లలు వేసుకుంటున్న దుస్తులలాగే ఉండేవా? తెలుసుకొని పట్టికలో రాయండి.

| అమ్మానాన్నలు చిన్నప్పుడు వేసుకున్న బట్టలు | తాతయ్య, నాయనమ్మ వాళ్ల చిన్నతనంలో వేసుకున్న బట్టలు | ఇప్పుడు చిన్నపిల్లలు వేసుకుంటున్న బట్టలు |
|---|---|---|
| | | |








## మనం డిజైన్లు వేద్దామా!

ఏ బట్టలైనా రంగులు, వాటిపైన ఉండే డిజైన్ల వల్ల అందంగా కనిపిస్తాయి. వీటిని బట్టే నచ్చినవాటిని ఎంపిక చేసుకుంటాం. కింది చిత్రాలు చూడండి. అవి ఎలా ఉన్నాయి? వాటిలో మీకు ఏది నచ్చింది? ఎందుకో చెప్పండి.











ఇలా మనం కూడా డిజైన్లు వేయవచ్చు! మీకు తెలుసా?



## డిజైన్లు వేద్దామా!

మీ దగ్గరలో ఉన్న టైలర్ దగ్గరకు వెళ్లి బట్టముక్కలు సేకరించండి.

ఒక బెండకాయను తీసుకోండి. దాన్ని అడ్డంగా కోయండి. ముక్కను రంగులో లేదా ఇంకులో ముంచండి. తెల్లకాగితం మీద లేదా బట్టమీద ముద్రించండి. మీకిష్టమైన డిజైన్ వేసుకోండి.



ఇలా బెండకాయ ముక్కలతో పాటు ఆలుగడ్డ ముక్కలు లేదా చేతిబొటనవేళ్లు, పాదముద్రలు మొదలయిన వాటిని రంగులో ముంచి కూడా రకరకాల డిజైన్లు వేయవచ్చు.

### కీలక పదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | బట్టల అవసరం | 2. | రకరకాల బట్టలు | 3. | వృత్తులనుబట్టి బట్టలు |
| 4. | వాతావరణాన్నిబట్టి బట్టలు | 5. | శుభ్రమైన బట్టలు | 6. | డిజైన్లు |
| 7. | రెడీమేడ్ బట్టలు | 8. | కుట్టించుకునే బట్టలు | 9. | యూనిఫారం |





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## మనం నేర్చుకున్నవి

★ దుస్తులు మనకు ప్రాథమిక అవసరం. పిల్లలు, పెద్దలు, ఆడవాళ్లు, మగవాళ్లు వివిధ రకాల దుస్తులు ధరిస్తారు.

★ కొంతమంది రెడీమేడ్ బట్టలు కొనుక్కుంటే, మరికొంతమంది బట్ట కొని కుట్టించు కుంటారు.

★ సాంప్రదాయాలను బట్టి పండుగలు, పెళ్లిళ్లవంటి సందర్భాలలో ప్రత్యేక దుస్తులు ధరిస్తారు.

★ వివిధ వృత్తుల వారు పనిచేసేటప్పుడు ఆ వృత్తికి సంబంధించిన ప్రత్యేక దుస్తులు ధరిస్తారు.

★ వాతావరణాన్ని బట్టి కాలానుగుణంగా వివిధ రకాల దుస్తులు వేసుకుంటారు.

★ బట్టల మీద రంగులతో రకరకాల డిజైన్‌లు వేస్తారు.

## ఇవి చేయండి




### విషయావగాహన

1. మనం బట్టలు ఎందుకు వేసుకోవాలి?
2. పిల్లలు, ఆడవాళ్లు, మగవాళ్లు ధరించే బట్టలకు మూడేసి ఉదాహరణలు రాయండి.
3. ఏయే వృత్తులవాళ్లు ఎటువంటి ప్రత్యేకమైన దుస్తులు ధరిస్తారు?
4. మగవాళ్ల బట్టలకు, ఆడవాళ్ల బట్టలకు పోలికలు, భేదాలు రాయండి.
5. కుట్టించుకున్న బట్టలు, కొనుక్కుని వేసుకునే (రెడీమేడ్) బట్టలలో మీకు ఏవంటే ఇష్టం? ఎందుకు? మూడు కారణాలు చెప్పండి. రాయండి.
6. మనం శుభ్రమైన బట్టలు వేసుకోవాలి కదా! ఎందుకు?



### బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. కింది డిజైన్‌ను చూడండి. మీరూ గీయండి. మీకు నచ్చిన రంగులు వేయండి.



2. మీకు నచ్చిన దుస్తుల బొమ్మలు గీసి, రంగులు వేయండి.

3. చీరలమీద రకరకాల డిజైన్లు ఉంటాయి కదా! మీరు కూడా మీ ఇంట్లో చీరలను చూసి మీకు నచ్చిన డిజైన్‌ను నోటుపుస్తకంలో గీయండి. ప్రదర్శించండి.



## సమాచార నైపుణ్యాలు – ప్రాజెక్టు పని

1. మీ మిత్రులనడిగి పండుగలకు వాళ్లు కొనుక్కున్న బట్టల వివరాలు సేకరించి, పట్టికలో రాయండి.

| క్ర.సం. | మిత్రుని పేరు | పండుగ పేరు | ఏ బట్టలు కొన్నారు? | రెడీమేడ్ బట్టలా? కుట్టించుకున్నవా? |
|---|---|---|---|---|
| | | | | |


- ఎక్కువమంది కొన్న బట్టలు ఏవి? ఏయే పండుగలకు కొన్నారు?
- ఎక్కువమంది రెడీమేడ్‌వి కొనుకున్నారా? లేక బట్టలుకొని కుట్టించుకున్నారా?

2. మీకు నచ్చిన డిజైన్‌లున్న బట్టముక్కలను సేకరించండి. వాటిని చార్టుమీద అతికించి ప్రదర్శించండి.



## ప్రశంస

1. కొంతమందికి వేసుకోడానికి బట్టలుండవు. అలాగే అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాలు, తుఫానులు మొదలయిన వాటివల్ల కూడా అన్నీ కోల్పోయినవాళ్లకు కూడా బట్టలు ఉండవు. ఇలాంటి వాళ్లకు మనం ఎలా సహాయం చేయవచ్చు?



## ప్రశ్నించడం


1. బట్టలు కొనడానికి లక్ష్మీవాళ్ల అమ్మానాన్నతో షాపుకు వెళ్లింది కదా? లక్ష్మీవాళ్ల అమ్మానాన్నలు షాపులో బట్టలమ్మేవాళ్లను ఏమేమి ప్రశ్నలు అడిగి ఉంటారు? మనం బట్టలు కొనేటప్పుడు ఎందుకు ప్రశ్నించాలి?



## నేనివి చేయగలను



| | | |
|---|---|---|
| 1. | బట్టల ఆవశ్యకతను వివరించగలను. | ఔను / కాదు |
| 2. | రకరకాల బట్టలకు సంబంధించిన వివరాలను పట్టికలో రాయగలను. | ఔను / కాదు |
| 3. | వివిధ వృత్తులవారు వేసుకునే బట్టలను గుర్తించగలను. | ఔను / కాదు |
| 4. | శుభ్రమైన బట్టలు వేసుకోడం అవసరమని తెలుసుకున్నాను. కాబట్టి రోజూ శుభ్రమైన దుస్తులు ధరిస్తాను. | ఔను / కాదు |
| 5. | రకరకాల డిజైన్ల బొమ్మలు గీయగలను. | ఔను / కాదు |
| 6. | రకరకాల బట్టల గురించి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

# 14. ఏవేవి ఎక్కడెక్కడ?

బిందు మూడో తరగతి చదువుతున్నది. బిందుతోపాటు రాజు, రమ, సతీష్ ఇలా చాలామంది పిల్లలున్నారు. వాళ్లందరూ వరసలో బెంచీలమీద కూర్చున్నారు. వాళ్ల తరగతిగదిని చూద్దామా!






- ముందువరసలో కూర్చున్నవాళ్లెవరు?
- వెనుకవరసలో కూర్చున్నవాళ్లెవరు?
- మధ్యవరసలో ఎవరెవరు ఉన్నారు?
- కింది పట్టికలోని పేర్లను చదవండి. వీరికి ముందు, వెనక, కుడి, ఎడమ పక్కన ఎవరెవరు ఉన్నారో పట్టికలో రాయండి.

| విద్యార్థి పేరు | ముందు | వెనుక | కుడి | ఎడమ |
|---|---|---|---|---|
| బిందు | | | | |
| మేరి | | | | |
| ఇస్మాయిల్ | | | | |
| రహీం | | | | |




బిందువాళ్ళ తరగతిగది చూశారు కదా! ఎవరెవరు ఎక్కడ కూర్చున్నారో మీ మిత్రులతో చర్చించండి. కింది చిత్రంలో రాయండి.





బిందువాళ్ల తరగతిగది ఎలా ఉందో, ఎవరెవరు ఎక్కడెక్కడ కూర్చున్నారో రాశారు కదా! మరి మీ తరగతిగదిలో ఎంతమంది ఉన్నారు? ఎవరెవరు ఎక్కడ కూర్చుంటారో చూపగలరా? కింది చదరాన్ని మీ తరగతి గది అనుకోండి. బిందువాళ్ల తరగతి గదిలాగా మీ తరగతిగదిలో





- నల్లబల్ల ఎక్కడ ఉంది?
- కుర్చీ ఎక్కడ ఉంది?
- టేబుల్ ఎక్కడ ఉంది?
- ముందువరసలో ఎవరెవరు కూర్చుంటారు? వారి పేర్లు రాయండి.
- మిగతా వరసల్లో ఎవరెవరు కూర్చుంటారో వాళ్ల పేర్లు రాయండి.

మీ తరగతిగదిలో ఎవరెవరు ఎక్కడ కూర్చుంటారో పటంలో చూశారు కదా! బిందువాళ్ల బడిని చూద్దామా?





బిందువాళ్ల బడిని ఇలా కూడా గీయవచ్చు తెలుసా? ఆ బడి పటం చూడండి.





బిందువాళ్ల బడిలో కింద ఏడు గదులు, పైన కూడా ఏడు గదులు ఉన్నాయి. అలాగే ఖాళీస్థలంలో ఎనిమిది కొబ్బరిచెట్లు ఉన్నాయి. ఆ బడిబొమ్మను పైన చూపిన విధంగా గుర్తులతో గీయవచ్చు. మరి మీ బడిలో ఎన్ని గదులు ఉన్నాయి? ఖాళీస్థలంలో ఏయే చెట్లు ఉన్నాయి? ఎన్ని ఉన్నాయి?

మీరు మీ బడి పటాన్ని కూడా పైన చూపిన విధంగా తెల్లకాగితం మీద గీయండి.


మీరు గీయడానికి ముందు చెట్లకోసం ఒక గుర్తును ఏర్పరుచుకోవాలి.

గదులకు తలుపులు ఎక్కడ ఉన్నాయో చూసి పైన చూపిన విధంగా గీయాలి.

బడికి ప్రహరీగోడ, బడిగేటు, జెండాగద్దె వంటివి ఎక్కడ ఉన్నాయో చూసి బొమ్మలో గుర్తులతో చూపాలి.



బిందువాళ్ళ ఊరిలో ఏమేమి ఉన్నాయో తెలుసా? బిందు రోజూ బడికి నడిచి వస్తుంది. బిందు ఇంటినుంచి బడికి వచ్చేటప్పుడు దారిలో ఏమేమి వస్తాయి? కింది చిత్రం చూడండి. మీ మిత్రులతో కలిసి చర్చించండి.





- బడికి ఎవరి ఇల్లు దగ్గరగా ఉంది? బిందుదా? రేఖదా?
- బిందు పార్కుమీదుగా పాఠశాలకు వెళ్లే దారిలో ఏమేమి ఉన్నాయి?
- బిందు బడికి ఏ ఏ మార్గాలలో వెళ్ళవచ్చో గీతలు గీసి చూపండి.


ఒక ప్రాంతంలో ఉండే ఇళ్లు, పాఠశాల, ఆస్పత్రి, తోట, బోరుబావి మొదలయిన వాటిని ఉన్నవి ఉన్నట్లుగా చిత్రంలో చూపడం వీలుపడదు. ఇలాంటి వాటిని గుర్తులతో సూచిస్తారు.



కింది గుర్తులను ఉపయోగించండి. బిందువాళ్ళ ఊరి పటంలో ఏవేవి ఎక్కడ ఉన్నాయో గుర్తులతో చూపండి.




బిందువాళ్ల ఊరిపటం చూశారు కదా! దీంట్లో గుర్తులుపెట్టి చూపారు. మరి మీ ఊరు / వాడ నుంచి మీ బడికి వచ్చే దారిని గీయగలరా? ఇందుకోసం కింది విధంగా చేయండి.

- మొదట మీ బడిని మధ్యలో గుర్తించండి. దానికి గుర్తు S పెట్టండి.
- మీ బడినుంచి మీ ఇల్లు ఎక్కడ ఉందో గుర్తించండి. దానికి గుర్తు  పెట్టండి.
- అలాగే మీ మిత్రుల ఇళ్లు కూడా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. వాటికి కూడా గుర్తులు పెట్టండి.
- ఇపుడు మీ ఇంటి నుండి మీ బడికి రోడ్డు / దారిని గీయండి.
- అలాగే మీ మిత్రుల ఇళ్లనుంచి కూడా బడికి రోడ్డును గీయండి.

◆ ఇప్పుడు మీ ఇంటినుంచి బడికి వచ్చే తోవలో రోడ్డుకు ఎడమవైపు, కుడివైపు ఏమేమి ఉన్నాయో చూడండి. ఒకవేళ చెట్టు ఉంటే గుర్తు పెట్టండి. గుడి ఉంటే పెట్టండి. మసీదు ఉంటే గుర్తు పెట్టండి. చర్చి ఉంటే గుర్తు పెట్టాలి. పోస్టాఫీసు ఉంటే [PO] గుర్తు పెట్టండి. హాస్పిటల్ ఉంటే [D] గుర్తు పెట్టాలి. పార్కు ఉంటే ఉంచండి.

మీ బడినుంచి మీ ఇళ్లకు వెళ్లే దారిని పటంలో చూశారు కదా! ఇలా మీ గ్రామపటాన్ని గీయవచ్చు. అలాగే మీ ఊరు గురించైనా, ఏ ప్రాంతం గురించైనా గుర్తులు ఉపయోగించి పటాలు గీయవచ్చు.

## కీలక పదాలు

1. పటం
2. ప్రాంతం
3. గుర్తులు
4. ముందు వెనక
5. మార్గం

## మనం నేర్చుకున్నవి

★ తరగతి గది, బడి, వీధి, గ్రామం ... ఇలా అన్ని పటాలూ గీయవచ్చు

★ పటంలో పాఠశాల, ఆసుపత్రి, పార్కు వంటివాటిని గుర్తులతో సూచిస్తారు.

★ ఒక చోటునుంచి మరొక చోటికి వెళ్లడానికి గుర్తులు ఉపయోగపడతాయి.

## ఇవి చేయండి



### విషయావగాహన

1. మీ ఇంటినుంచి పాఠశాలకు వెళుతు ఉంటే ఏవి ఏవైపున ఉన్నాయి?

   కుడివైపున ..................................

   ఎడమవైపున ..................................


2. మీ ఇంటికి ఏ వైపున ఎవరి ఇల్లు ఉన్నదో చెప్పండి.

| కుడివైపు | ఎడమవైపు | ముందు | వెనక |
|---|---|---|---|
| | | | |





## పటనైపుణ్యాలు




1. పటం చూడండి.
   - గుర్తులు ఆధారంగా రామువాళ్ల ఊరిలో ఏమేమి ఉన్నాయో చెప్పండి.
   - రాము ఇంటినుండి హాస్పిటల్‌కు వెళ్లే దారిని గీయండి.
   - రాము ఇంటినుంచి బడికి వెళ్లే దారులను చూపండి.

3. మీ ఇంటినుంచి పాఠశాలకు వెళ్లేదారిని చూపే పటం గీయండి.



## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మీ గ్రామంలో / వాడలో ఏమేమి ఉన్నాయో వివరాలు సేకరించండి. (పోస్టాఫీసు, బడి, గుడి, బ్యాంకు, చౌకధరల దుకాణం, వైద్యశాల మొదలయినవి). ఒక్కొక్క దానికి ఒక గుర్తును కేటాయించుకోండి. మీ గ్రామంలోని వీధులను, రోడ్లను గీయండి. గ్రామంలో ఏవేవి ఎక్కడ ఉన్నాయో గుర్తులతో పటంలో చూపండి. గ్రామపటం తయారుచేయండి.



## ప్రశ్నించడం

1. బిందువాళ్ల మిత్రులంతా ఊరిపటం గీయాలని అనుకున్నారు. ఇందుకోసం వాళ్లందరూ వాళ్ల టీచర్ దగ్గరికి వెళ్లారు. టీచర్‌ను రకరకాల ప్రశ్నలు అడిగారు. అలాగే మీరు కూడా మీ ఊరు / వాడ పటం గీయడానికి టీచర్‌ని ఏయే ప్రశ్నలు అడుగుతారు? వాటిని రాయండి.



## నేనివి చేయగలను



| | | |
|---|---|---|
| 1. | నేను పటాన్ని చదవగలను. | ఔను / కాదు |
| 2. | పటంలో సూచించే గుర్తులను అర్థం చేసుకోగలను. | ఔను / కాదు |
| 3. | ఇంటినుంచి బడికి దారిని గీయగలను. | ఔను / కాదు |
| 4. | తరగతి, బడి పటాలు గీయగలను. | ఔను / కాదు |
| 5. | గ్రామపటం గీయడానికి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |






తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

# 15. నీరు - మన అవసరాలు





తరగతిలో పిల్లలందరూ కలిసి ఈ పాట పాడుతున్నారు. మీరూ పాడండి. పాట గురించి మాట్లాడండి.

చిటపట చినుకుల వాన - చిరుజల్లై కురిసే వాన
నేలంతా తడిపే వాన - హరివిల్లై విరిసేనా?

నల్ల మబ్బులతో ఆకాశంలో కదిలే ఈ వాన
గాలితరగల సాయంతో జాలువారే ఈ వాన
జలజల గలగల పారే సవ్వడి ఈ వాన
చెరువులు, బావులు నిండుగ నింపే ఈ వాన.

అందరి దాహం తీర్చగ దిగివచ్చే ఈ వాన
జీవరాశులన్నిటికి జీవధార ఈ వాన
పసిడి పంటల నివ్వగా పరుగెత్తే ఈ వాన
పరిసరాలను పచ్చదనంతో నింపే ఈ వాన.

వాననీరు ఎక్కడెక్కడికి చేరుతుంది?

నీరు ఎక్కడెక్కడ లభిస్తుంది?





వాగులు, వంకలు, కాలువలు, బావులు, చెరువులు, నదుల వంటి నీటివనరులనుంచి మనకు నీరు లభిస్తుంది. సాధారణంగా మనం బావులు, కుళాయిలు, చేతిపంపు, కాలువల నుండి నీళ్లను తెచ్చుకొని పాత్రల్లో నిలవ చేసుకొని అవసరాలకోసం వాడుకుంటాం.



సలీంవాళ్ల ఇంట్లో నీళ్లు నిలవ చేసుకోవడానికి ఈ కింది పాత్రలు ఉపయోగిస్తారు. వాటిని చూడండి.




చిత్రంలో చూపిన పాత్రల్లో నీరు నిండుగా నింపితే –

దేంట్లో నీరు ఎక్కువగా పడుతుంది?

మీ ఇంట్లో ఏయే పాత్రల్లో నీరు నిలవ చేస్తారు?

మనం ఇళ్లలో నీటిని నిలవ ఉంచుకోవడంకోసం బిందెలు, కుండలు, బకెట్లు, సిమెంటు తొట్టెలు మొదలైనవి ఉపయోగిస్తాం. మన అవసరాలకు వాడుకుంటాం.

## మనకు నీరు ఎందుకు అవసరం?



మనం ప్రతిరోజూ నిద్రలేచినప్పటినుంచి రాత్రి నిద్రపోయేవరకు నీటిని అనేక అవసరాలకు ఉపయోగించుకుంటాం. కింది చిత్రాలను చూడండి. వాళ్లు ఏం చేస్తున్నారు?





నీళ్లు ఇంకా ఏయే పనులకు ఉపయోగిస్తామో మీ మిత్రులతో చర్చించి రాయండి.
ఏయే పనులకు నీరు ఎక్కువ కావాలి! ఏయే పనులకు నీరు తక్కువ కావాలి?

## మొక్కలు బతకడానికి నీరు అవసరమా?


మనకు నీళ్లు అవసరం అని తెలుసుకున్నారు కదా! మనలాగే ఇంకా వేటికి నీళ్లు అవసరమో తెలుసా? మనతో పాటు మొక్కలకు కూడా నీరు అవసరమా? ఆలోచించండి. ఇందుకోసం కింది విధంగా చేయండి.




### చేసి చూడండి. ఏం జరిగిందో చెప్పండి.

రెండు మొక్కలను తీసుకోండి. ఒకదానికి రోజూ నీళ్లు పోయండి. రెండో దానికి నీళ్లు పోయకండి. ఇలా వారం రోజులు చేయండి. తర్వాత ఆ రెండు మొక్కలను చూడండి. ఏమి జరిగిందో పట్టికలో రాయండి.

| వారం | ఏం జరిగింది? | |
|---|---|---|
| | 1వ మొక్క | 2వ మొక్క |
| సోమవారం | | |
| మంగళవారం | | |
| బుధవారం | | |
| గురువారం | | |
| శుక్రవారం | | |
| శనివారం | | |
| ఆదివారం | | |



1వ మొక్క　　2వ మొక్క




నీళ్లు లేకపోతే మొక్కలు వాడిపోతాయి. అందుకే మన ఇళ్లలో, పాఠశాలలో ఉండే మొక్కలకు రోజూ నీళ్లు పోయాలి. అప్పుడే మొక్కలు బాగా పెరుగుతాయి. అందంగా కనిపిస్తాయి.

సలీం పాఠశాల పరిశుభ్రత కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. మిత్రులతో కలిసి పాఠశాలలో గులాబి, మందారం, గన్నేరు వంటి మొక్కలు తెచ్చి నాటాడు. వాటికి రోజు నీళ్లు పోశాడు. కొద్ది రోజులకు ఆ చెట్లన్నీ పూలు పూశాయి. ప్రార్థనాసమయంలో ఉపాధ్యాయులు సలీం చేసిన పనిని మెచ్చుకున్నారు. బడిలో పిల్లలందరూ మొక్కలకు నీళ్లు పోయాలని చెప్పారు.

మరి మీరు కూడా ఇలా చెట్లకు నీళ్లు పోస్తున్నారా? మీ ఇంట్లో లేదా బడిలో చెట్లకు, మొక్కలకు నీళ్లు పోయండి. మీరు నీళ్లుపోసి పెంచుతున్న మొక్కకు పూలు పూస్తే మీకు ఎలా అన్పిస్తుందో! చెప్పండి.





## జంతువులకు నీళ్లు అవసరం




ఒకరోజు మధు, కిషన్ ఇంటికి వచ్చాడు. కిషన్ ఇంట్లో అక్కడక్కడ చిన్న చిన్న నీటిపాత్రలు కన్పించాయి. కిషన్ ఆ పాత్రల్లో నీళ్లు పోయగానే కోళ్లు వచ్చి నీళ్లు తాగసాగాయి. కోడి నీళ్లు తాగే విధానం చూసిన మధుకు భలే ముచ్చటేసింది. దీన్ని బట్టి మీకేమి తెలిసింది? మనకూ, మొక్కలకూ నీరు అవసరమున్నట్లే జంతువులకు కూడా నీరు అవసరం. జంతువులకు కూడా నీరు అవసరమని చెప్పడానికి కొన్ని ఉదాహరణలు చెప్పండి. మీ మిత్రులతో కలిసి ఆలోచించండి.

మీరు ఏ ఏ జంతువులు నీళ్లు తాగడం చూశారు?

జంతువులకు నీళ్లు తాగడానికే కాకుండా ఇంకా ఎందుకోసం అవసరం?


### మీకు తెలుసా?



ఒంటె ఒకసారి నీళ్లను తాగితే చాలా రోజుల వరకు నీళ్లు తాగకుండా ఉండగలుగుతుంది. నీళ్లు దొరికినపుడు బాగా తాగి నీటిని తన శరీరంలో నిలవ చేసుకుంటుంది.

మొక్కలు బతకడానికి నీళ్లు ఎలా అవసరమో జంతువులు బతకడానికి కూడా నీళ్లు అంతే అవసరం.

## మనం ఎలాంటి నీటిని తాగాలి?




మధు, కిషన్ పాఠశాలలో ఆడుకుంటున్నారు. మధుకు దాహం వేసింది. వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్లి గ్లాసును కుండలో ముంచబోయాడు. కిషన్ వెంటనే మధు చేయి పట్టుకుని అలా నీళ్లలో చేతిని ముంచవద్దని అన్నాడు. కిషన్ మధుతో ఇలా ఎందుకు అని ఉంటాడు? చేత్తో గ్లాసును పట్టుకొని నేరుగా కుండలో ముంచితే ఏమౌతుందో? ఆలోచించండి.

## చేసి చూడండి. ఏం జరిగిందో చెప్పండి.




కిషన్ రెండు పెద్దగాజు గ్లాసులు తీసుకొచ్చాడు. రెండింటిని నీటితో నింపాడు. ఒక గ్లాసులోని నీళ్లలో మధు చేయిని ముంచమన్నాడు. మధు అలాగే చేశాడు. ఏం జరిగి ఉంటుంది? మీరు కూడా ఇలాగే చేసి చూడండి. మొదటి గ్లాసులో మీ చేతిని ముంచండి. గ్లాసులోని నీటిరంగు ఎలా మారింది? రెండో గ్లాసులోని నీరు ఎలా ఉంది? ఏ గ్లాసులోని నీరు మురికిగా మారింది? ఈ మురికి ఎక్కడినుంచి వచ్చింది? దీన్నిబట్టి మీరేమి తెలుసుకొన్నారు?



1వ గ్లాసు 2వ గ్లాసు

మనం ఆడుకునేటప్పుడు, పనులు చేసేటప్పుడు మన



చేతులకు దుమ్ము, ధూళి, మలినాలు అంటుకుంటాయి. చేతులను కడుక్కోకుండా, తాగేనీటిలో చేతులను పెడితే ఆ మలినాలన్నీ నీటిలోకి చేరతాయి. అలాంటి నీళ్లు తాగితే రోగాలు వస్తాయి. కాబట్టి దుమ్ము, ధూళి చేరనటువంటి పరిశుభ్రమైన నీరు తాగాలి.



బావులు, కుంటలు, చెరువులు, కాలువలు మొదలయిన వాటిలో నీరు ఉంటుందని తెలుసుకదా! కింది చెరువు బొమ్మ చూడండి.



చెరువులో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారు?

వాళ్లు చేస్తున్న పనులవల్ల చెరువులోని నీరు ఏమౌతుంది?

ఈ చెరువులోని నీళ్లు తాగితే ఏమౌతుంది?

చెరువులు, బావుల్లో చెత్తా చెదారం, దుమ్ము, ధూళితోపాటు బట్టలు ఉతకడం, పాత్రలు కడగడం వంటివాటివల్ల మలినాలు చేరతాయి. వాటితోపాటు మనకు హానిచేసే క్రిములు కూడా నీటిలోకి చేరతాయి. ఇలాంటి నీరును 'అపరిశుభ్రమైన నీరు' లేదా 'కలుషితమైన నీరు' అని అంటారు. ఇలాంటి నీళ్లు తాగితే వాంతులు, విరేచనాలు, కామెర్లు, కలరా వంటి రోగాలు వస్తాయి.



## మంచి అలవాట్లు

మనకు వచ్చే వ్యాధుల్లో ఎక్కువ వ్యాధులు కలుషితమైన నీటిని తాగడంవల్లనే వస్తాయి.

ఇందుకోసం మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మనకు మంచి అలవాట్లు ఉండాలి! అవి ఏమై ఉంటాయో ఆలోచించండి.

కుండలోని నీటిని గరిటెతో గ్లాసులో పోసుకొని తాగాలి.

గ్లాసుతో నీళ్లు తాగేటపుడు నోటికి ఆనించి తాగకూడదు. గ్లాసు ఎత్తి తాగాలి.

చెరువుల్లోని, బావుల్లోని నీరు తాగగూడదు.

బోరు, నల్లాల ద్వారా వచ్చే సురక్షితమైన నీరు మాత్రమే తాగాలి;
వడబోసిన నీరు మాత్రమే తాగాలి.


ఒకసారి వాడిన, మందంలేని ప్లాస్టిక్ సీసాలో నీళ్లు తాగరాదు.

ప్లాస్టిక్ సీసాలోని నీళ్లలో ప్లాస్టిక్ కరిగిపోయి విషపదార్థాలు చేరతాయి.

మందమైన ప్లాస్టిక్ సీసాలోనే నీళ్లు తెచ్చుకోవాలి.



## శుభ్రమైన నీళ్లు అందరికీ అందుబాటులో ఉంటాయా?



రజని వాళ్ల ఇంట్లో నల్లా ఉంది. నల్లాలో వచ్చిన నీళ్లను మాత్రమే వాడుకుంటారు. వెంకన్న వాళ్లింట్లో నల్లా లేదు. వాళ్లు వీధిలోని నల్లా దగ్గర నీళ్లు తెచ్చుకుంటారు. ఆ వీధి నల్లా దగ్గర ఎలా ఉందో కింది చిత్రం చూడండి.

ఇలాంటి పరిసరాలలోని నీళ్లు తెచ్చుకుని తాగితే ఏమౌతుంది?

వీధి నల్లా దగ్గర శుభ్రంగా ఉండాలంటే మనం ఏం చేయాలి?

సాధారణంగా నీటిని బిందెల్లో, కుండల్లో నింపి పెట్టుకొంటారు. కొంతమంది ఇళ్లలో రంజనులో కూడా నీటిని నింపి పెట్టుకుంటారు. రంజనులో నీళ్లు నువ్వెప్పుడైనా తాగావా? ఎలా ఉంటాయి? రంజనులో నీళ్లుపోసిన తర్వాత ఒక గంట తరవాత చూడండి. ఏం గమనించారు? రంజనులోని నీరు చల్లగా ఉంటుంది. రజని వాళ్ల మామయ్య ఇంట్లో వాటర్ బబుల్‌ను చూసింది. అట్లాగే కరెంటు ద్వారా నీటిని శుద్ధిచేసే పరికరాన్ని చూసింది. ఇది ఎందుకని అడిగింది.



‘ఇది నీటిని శుద్ధిచేస్తుంది’ అని రజనికి వాళ్ల మామయ్య చెప్పాడు. మరి మీ ఊళ్లో కూడా ఇలా నీళ్లక్యాను లేదా బబుల్స్‌తో నీళ్లు తెప్పించుకుంటున్నారా? ఎందుకు తెప్పించుకొంటున్నారు? ఇంకా ఎవరెవరి ఇళ్లలో నీటిని శుద్ధిచేసే పరికరాలు ఉన్నాయో తెలుసుకొని చెప్పండి.

నీటిలో క్లోరిన్ బిళ్లలు వేయడం లేదా బ్లీచింగ్ పౌడరు వేస్తే నీటిలోని క్రిములు చనిపోతాయి.



## నీటికొరత




రజనివాళ్లింట్లో చేదబావి ఉంది. రజనివాళ్లమ్మ వేసవిలో బకెట్‌ను బావిలోకి వదిలింది. కానీ బకెట్‌కు నీళ్లు అందలేదు. తాడు సరిపోలేదు. తాడు తీసుకునిరమ్మని రజనికి చెప్పింది. తాడు ఉంది కదా! మళ్లీ ఎందుకు? అని అడిగింది రజని. వేసవికాలం కదా! బావిలో నీళ్లు లోతుకు వెళ్లాయి. బకెట్‌కు అందడం లేదు అని రజని వాళ్ల అమ్మ చెప్పింది.

ఇలా బావిలోని నీరు లోపలికి ఎందుకు వెళ్లి ఉంటుంది?

ఏ కాలంలో బావిలో నీరు తగ్గుతుంది? ఎందుకు?

వేసవి కాలంలో బావులు, చెరువులు ఎండిపోతాయి. బోరుబావుల్లో కూడా నీరు అడుగంటిపోతుంది. ఊళ్లలో జనానికి అవసరానికి చాలినంత నీళ్లు దొరకవు. ఇలాంటి పరిస్థితినే ‘నీటి ఎద్దడి’ అంటారు. అలాంటి సమయాల్లో ప్రభుత్వమే ట్యాంకర్లద్వారా నీటిని సరఫరా చేస్తుంది. ఇలా మీ గ్రామంలో ఎప్పుడైనా జరిగిందా? ట్యాంకర్లో నీటిని ఎప్పుడైనా తెచ్చారా? ఎందుకు తెచ్చి ఉంటారు? ఇంకా ఏయే సందర్భాలలో ట్యాంకర్లలో నీటిని తెస్తారు?







వేసవిలో నీరు దొరక్కపోతే ఏ ఏ ఇబ్బందులు కలుగుతాయి?
వేసవిలో నీటికొరత తీరాలంటే ఏం చేయాలి?



## నీటిని పొదుపు చేయడం

రహీం వేసవి సెలవుల్లో హైదరాబాద్‌కు వచ్చాడు. వాళ్ల చిన్నాన్న ఇంటిపెరట్లో ఉన్న పెద్ద గుంతను చూశాడు. 'ఇది ఎందుకు?' అని అడిగాడు రహీం. ఇది ఇంకుడు గుంత. వర్షాకాలంలో వర్షపు నీటిని, ఈ గుంతలోకి మళ్లిస్తే భూమిలో నీటినిలవలు పెరుగుతాయి. నీటినిలవలు పెంచుకోవడం ఎంత ముఖ్యమో, నీటిని పొదుపుగా వాడుకోవడం కూడా అంతే ముఖ్యం అని రహీంవాళ్ల చిన్నాన్న చెప్పాడు.

నీటిని పొదుపుగా వాడాలి. కాపాడుకోవాలి అని తెలుసుకున్నారు కదా! మరి కింది చిత్రాలు చూడండి. వీటిని చూసి మీరేం గ్రహించారు?



మొదటి చిత్రంలో నీరు ఏమౌతున్నది? ఇలా ఎందుకు జరుగుతున్నది?
రెండో చిత్రంలో ఏం జరుగుతున్నది? ఇంకా ఇలా ఎప్పుడెప్పుడు నీరు వృథా అవుతుంది?
మూడో చిత్రం చూడండి. నీరు ఎలా వృథా అవుతున్నది? దీనివల్ల ఎవరికి నష్టం కలుగుతుంది?
ఇలాంటి సందర్భాలలో నీరు వృథాకాకుండా ఉండటానికి ఏం చేయాలి?

నీరు మనకు ఎంతో ముఖ్యమైనది. మనం జీవించడానికి నీరు అవసరం. ఇలాంటి నీటిని వృధా చేయకూడదు. పొదుపుగా వాడాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. కలుషితమైన నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి.

**నీటి వృధాను అరికడదాం – నీటిని పొదుపుగా వాడుకుందాం – ఇది మన కర్తవ్యం**

## కీలక పదాలు

1. నీటినిలవలు
2. నీటి ఉపయోగాలు
3. పరిశుభ్రమైన నీరు
4. కలుషితమైన నీరు
5. నీటిని వృధాచేయడం
6. ఇంకుడు గుంత

## మనం నేర్చుకున్నవి

★ వాగులు, కాలువలు, బావులు, చెరువులు, నదులు వంటి నీటివనరులనుంచి నీరు లభిస్తుంది.

★ తాగడం, బట్టలు ఉతకడం, పాత్రలు కడగడం, స్నానంచేయడం వంటివాటికి నీటిని ఉపయోగిస్తారు.

★ జంతువులు, మొక్కలు బతకడానికి నీరు అవసరం.

★ సాధారణంగా నీటిని కుండ, బకెట్, బిందె, తొట్టి, ట్యాంక్‌లలో నిలవచేస్తారు.

★ కలుషితమైన నీటిని తాగడంవల్ల అనేక వ్యాధులు వస్తాయి.

★ నీటిని పొదుపుగా వాడుకోవాలి. శుభ్రమైన నీటిని మాత్రమే తాగాలి.

★ పైపులనుంచి, ట్యాంకులనుంచి, నల్లాల నుండి నీరు వృధా కాకుండా చూడాలి.

## ఇవి చేయండి



### విషయావగాహన

1. నీరు లేకుంటే ఏమవుతుంది?
2 నీటి వనరులకు కొన్ని ఉదాహరణలు చెప్పండి. మీ ప్రాంతంలో ఉన్న నీటివనరులేవి?
3. మీ ఇంట్లో నీటిని వేటిలో నిలవ చేస్తారు?
4. మీ ఇంట్లో ఎప్పుడెప్పుడు నీరు వృధా అవుతుంది? దీన్ని అరికట్టడానికి మీరేం చేస్తారు?
5. మీ పరిసరాల్లో నీరు ఎక్కడెక్కడ వృధా అవుతుందో ఉదాహరణలు చెప్పండి.
6. చెరువు నీళ్లు, నల్లా నీళ్లల్లో ఏవి తాగడానికి మంచిది? ఎందుకు?
7. నీటిని మనం పొదుపుగా వాడాలి కదా! ఇందుకోసం మీరు చేసే కనీసం 5 పనులు రాయండి.





8. మనమందరం పరిశుభ్రమైన నీరు తాగాలి? ఎందుకంటే ................................

9. కొన్ని ప్రాంతాలలో తాగడానికి, ఇతర అవసరాలకు కూడా ట్యాంకరులో నీళ్లను సరఫరా చేస్తారు. ఆ ప్రాంతంవాళ్లు నీటిని ఎలా వాడుకోవాలి? వృధాకాకుండా ఏమేమి చేయాలి?



## బొమ్మలు గీయండి. రంగులు వేయండి.


1. మీ ఇంట్లో నీటిని దేంట్లో నిలవచేస్తారు? వాటి బొమ్మలు గీయండి.



## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. మనం ప్రతి రోజూ నీళ్లు తాగుతాం కదా! ఎన్నిసార్లు తాగుతామో తెలుసా? తెలుసుకోవాలని ఉందా! అయితే ఇలా చేయండి? మీరు ఉదయంనుంచి రాత్రి పడుకొనే వరకు ఎన్ని గ్లాసుల నీరు తాగుతారో లెక్కించండి. ఆ వివరాలను కింది పట్టికలో రాయండి.

| నీళ్లు తాగిన సమయం | ఎన్ని గ్లాసులు నీళ్లు తాగారు? |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

- మొత్తం ఎన్ని గ్లాసులు నీళ్లు తాగావు?
- ఏ సమయంలో ఎక్కువ సార్లు నీళ్లు తాగావు?
- నీలాగే మీ మిత్రులు కూడా రాశారు కదా! వాళ్లు కూడా ఎన్ని గ్లాసులు తాగారో తెలుసుకోండి?
- నీ కంటే ఎక్కువ నీళ్లు తాగిన వాళ్లు ఎవరు?
- నీకంటే తక్కువ నీళ్లు తాగిన వాళ్లు ఎవరు? అందరి కంటే ఎక్కువ నీళ్లు ఎవరు తాగారు?
- అందరికంటే తక్కువ నీళ్లు తాగింది ఎవరు?



## ప్రశంస

1. లత ఒకరోజున ఆడుకోవడానికి తన స్నేహితురాలు ఇంటికి వెళుతున్నది. దారిలో కొందరు పిల్లలు బోరింగ్ కొడుతూ నీళ్లను వదిలేస్తున్నారు. అది చూసి నీటిని వృధా చేయవద్దని ఆ పిల్లలకు వివరించింది. లత ఏం చెప్పి ఉంటుంది? మీరైతే ఏం చేస్తారు?

   లత చేసిన పని మంచిదా? కాదా? ఎందుకు?



## ప్రశ్నించడం

1. సోము నీటి పొదుపు గురించి, నీరు పరిశుభ్రం కావడం గురించి తెలుసుకోవాలనుకున్నాడు. ఇందుకోసం వాళ్ల టీచరు దగ్గరికి వెళ్లాడు. సోము వాళ్ల టీచరును ఏమేమి అడిగి ఉంటాడు? టీచరు ఏం చెప్పి ఉంటారు?

2. జంగు ఒకసారి హైదరాబాదుకు వచ్చాడు. అక్కడ ట్యాంకర్లలో నీళ్లు తేవటం చూశాడు. జంగుకు చాలా ఆశ్చర్యం అనిపించింది? ట్యాంకర్లలో నీరు తేవడం ఎందుకని? అక్కడే ఉన్న హుస్సేన్ తాతను అడిగాడు. జంగు చాలా ప్రశ్నలు అడిగాడు. నీవైతే ఏమేమి అడుగుతావు?




## నేనివి చేయగలను





| | | |
|---|---|---|
| 1. | ఏయే వనరులనుంచి మనకు నీరు లభిస్తుందో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | నీరు ఎలా అపరిశుభ్రం అవుతుందో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | నీటిని పొదుపుగా ఎలా, ఎందుకు వాడుకోవాలో చెప్పగలను. | ఔను / కాదు |
| 4. | మా ప్రాంతంలోని నీటివనరులను గుర్తిస్తాను. | ఔను / కాదు |
| 5. | నీటి వృధా, పొదుపు గురించి ప్రశ్నించగలను. | ఔను / కాదు |





# 16. ఊరికి పోదాం





అబ్దుల్లా వాళ్లబంధువుల ఇంట్లో పెళ్ళికి అమ్మా నాన్నలతో కలిసి ముంబాయి బయలుదేరాడు. వాళ్లంతా కలిసి ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు  లో వెళ్లారు. ప్లాట్‌ఫారంమీదికి ముంబాయి వెళ్లే  వచ్చి ఆగింది. అబ్దుల్లా, వాళ్ల అమ్మానాన్నా ముంబాయి వెళ్లే  ఎక్కారు. రైలులో రాత్రంతా ప్రయాణంచేసి ఉదయం ముంబాయికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు దగ్గరగా ఉన్న బంధువుల ఇంటికి  లో వెళ్లారు. ఉదయం అమెరికానుంచి పెళ్లికి వస్తున్న, వాళ్ల మామయ్యను కలుసుకోవడానికి  లో విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడ  చూశారు.  దిగిన మామయ్యను కలుసుకొని అందరూ  లో ఇంటికి చేరుకొన్నారు. సాయంత్రం  లో సముద్రం మధ్యలో ఉన్న ఎలిఫెంటా గుహలకు వెళ్లారు. మరుసటి రోజున పెళ్లి బాగా జరిగింది. పెళ్లి సామాన్లు  లో వేసుకొని అందరూ తిరుగు ప్రయాణమయ్యారు.

ప్రయాణం అంటే ఏమిటి?

అబ్దుల్లా ఏ ఏ వాహనాలలో ప్రయాణించాడు?

ఏ ఏ వాహనాలు చూశాడు?

పై వాహనాలలో మీరు వేటిని చూశారు? వేటిలో ప్రయాణించారు?





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



అబ్దుల్లా ఏయే వాహనాలు చూశాడో, వేటిలో ప్రయాణించాడో తెలుసుకున్నారు కదా! వాహనాలనేవి ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి వెళ్లడానికి ఉపయోగపడతాయి. వీటిలో ప్రయాణం చేసి మనం వెళ్లాలనుకున్న ప్రాంతాలకు చేరవచ్చు.

ఇప్పటి వరకు రకరకాల వాహనాలను గురించి తెలుసుకున్నారు కదా! వీటిలో కొన్ని నీటిలో ప్రయాణిస్తాయి, మరికొన్ని గాలిలో ప్రయాణిస్తాయి, ఇంకొన్ని నేలమీద ప్రయాణిస్తాయి. కింది చిత్రాన్ని చూడండి. ఏవేవి ఎక్కడ ప్రయాణిస్తున్నాయో చెప్పండి.






నేలమీద, నీటిమీద, గాలిలో ప్రయాణించే వాహనాలు మీకు తెలుసా? వాటి పేర్లను కింది పట్టికలో రాయండి.

| రోడ్డుమీద ప్రయాణించేవి | నీటిలో ప్రయాణించేవి | గాలిలో ప్రయాణించేవి |
|---|---|---|
| | | |


మీ ఊరిలో ఏ ఏ రకాల వాహనాలు ఉన్నాయి?








కింది చిత్రాలు చూడండి. వీటిలో మీ ఊరిలో ఉపయోగించేవాటికి రంగులు వేయండి.



మీ ఊరిలో వేటిని ప్రయాణానికి ఉపయోగిస్తున్నారో గుర్తించారు కదా! ఇవి కాకుండా ఇంకా ఏయే వాహనాలను మీ ఊరిలో ప్రయాణించడానికి ఉపయోగిస్తారు?






మీరున్న చోటునుంచి దగ్గరి ప్రాంతాలకు వెళ్లడానికి వేటిని ఉపయోగిస్తారు? దూరంగా ఉన్న ఊర్లకు వేటిలో వెళ్తారు. చాలా దూరంగా ఉన్న ప్రాంతాలకు వేటిలో వెళ్తారో చెప్పండి. వాటిని కింది పట్టికలో రాయండి.

| దగ్గరి ప్రాంతాలకు వెళ్లడానికి | దూర ప్రాంతాలకు వెళ్లడానికి | చాలా దూర ప్రాంతాలకు వెళ్లడానికి |
|---|---|---|
| | | |

ప్రయాణించే దూరం, అవసరాన్ని బట్టి వివిధ రకాల వాహనాలను ఉపయోగిస్తారు. దగ్గరగా ఉండే ప్రదేశానికి నడిచి వెళతారు. సైకిల్, ఆటో, రిక్షా, పడవ, గుర్రపు బండి వంటి వాహనాలపై కూడా వెళతారు. దూరంగా ఉండే ప్రాంతాలకు బస్సు, రైలు, కారు, మోటార్ సైకిల్, జీపు వంటివాటిల్లో వెళతారు. చాలా దూర ప్రాంతాలకు, విదేశాలకూ విమానంలో, ఓడలలో ప్రయాణిస్తారు.



సూరారం ఊరు అడవికి దగ్గరగా ఉంది. ఆ ఊరిలోనివాళ్లు అప్పుడప్పుడు అడవికి వెళ్ళుతూ ఉంటారు. బంక, తేనె, కుంకుడుకాయలు మొదలయిన వాటికోసం అడవికి వెళతారు. అయితే అడవిలోకి పోవడానికి రోడ్డు లేదు.

వీళ్ళు అడవిలోకి వెళ్లడానికి దేనిపైన వెళతారో ఆలోచించండి.

సూరారం ఊరికి బస్సులు కూడా వస్తాయి. సూరారంనుంచి ఇంకా దూరంగా ఉండే గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంవల్ల బస్సులు వెళ్లవు. మరి ఇలాంటి గ్రామాలకు ఎలా వెళతారు? శివరాత్రికి సూరారం ఊర్లోనివాళ్లందరూ మల్లన్న జాతరకు వెళ్లాలనుకున్నారు. ఇందుకోసం వాళ్లు ఒక బస్సును మాట్లాడుకున్నారు. బస్సులో అందరూ శివరాత్రికి మల్లన్న జాతరకు కొమరవెల్లి వెళ్లి వచ్చారు.





ఏయే సందర్భాలలో ప్రత్యేకంగా బస్సులు మాట్లాడుకుని వెళతారు.
ఒకవేళ ఆ ఊళ్లలో బస్సులు లేకుంటే ఎలా వెళతారు?

సూరారంలాంటి ఊర్లు ఇంకా ఉన్నాయి. ఇలాంటి ఊర్లలో ఏయే ప్రయాణ సాధనాలు ఉంటాయి? అలాగే కొన్ని ఊళ్లకు బస్సులు రావు. అలాంటి ఊళ్లలోని వాళ్లు ఎలా ప్రయాణాలు చేస్తారు?

కింది ప్రయాణసాధనాల పేర్లను చదవండి. వాటిలో ఏవేవి ఏయే ప్రాంతాల్లో ఉపయోగిస్తారో ఆలోచించి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సైకిల్ | ఎడ్లబండి | ఆటో | స్కూటర్ | ట్రాక్టర్ | రిక్షా |
| జీప్ | బస్సు | వ్యాన్ | లారీ | బైక్ | పడవ |








| అటవీప్రాంతంలో తిరగడానికి ఉపయోగపడేవి | రోడ్డులేని ఊర్లకు వెళ్లడానికి ఉపయోగపడేవి | బస్సులేని ఊర్ల నుంచి ఇతర ఊర్లకు వెళ్లడానికి ఉపయోగపడేవి | జాతరలకు, పెళ్లిళ్లకు వెళ్లడానికి ఉపయోగపడేవి |
|---|---|---|---|
| | | | |



ప్రతి ఊరిలోని వాళ్లకూ ప్రయాణం చేయడానికి రకరకాల వాహనాలు అవసరమౌతాయి. చాలా ఊర్లకు రోడ్డు సౌకర్యం ఉంది. ఇలాంటి ఊర్లకు బస్సులు వస్తాయి. బస్సులలో ఇతర ఊర్లకు వెళతారు. రోడ్డు సౌకర్యం లేని ఊర్లో వాళ్లు ఇతర ఊర్లకు వెళ్లడానికి ఎడ్లబండ్లను, సైకిళ్లను, మోటార్ సైకిళ్లను, ఆటోలను, జీపులను ఉపయోగిస్తారు.





బండ్లను లాగడానికి ఎడ్లను ఉపయోగిస్తాం. కొన్ని బండ్లను లాగడానికి గుర్రాలను కూడా కడతారు. ఏనుగులు, గాడిదలు, ఒంటెలను కూడా ప్రయాణాలకు ఉపయోగిస్తారు. కింది చిత్రాలు చూడండి. వీటిని మీరెప్పుడైనా చూశారా?











ఈ మధ్య కాలంలో ఎడ్లబండ్ల, గుర్రపు బండ్ల వాడకం తగ్గింది కదా! ఎందుకో ఆలోచించండి.


కొన్ని ఊర్లలో పెళ్లిళ్లకు, జాతరలకు వెళ్లడానికి బస్సు, వ్యాన్, లారీ, ట్రాక్టర్లలో వెళ్తుంటారు. మరికొన్ని ఊర్లలో ఇప్పటికీ కూడా ఎడ్లబండ్లపైనే ఒక ఊరి నుంచి మరొక ఊరికి వెళుతూంటారు.


మరి మీ ఊరిలో జాతరలు, పెండ్లిళ్లు వంటివాటికి వేటిపైన వెళతారు?



కొన్ని ఊర్లలోని వాళ్లు వాళ్ల ఊరిలో పనులు దొరకక వేరే ఊళ్లకు వలస వెళుతుంటారు. ఇలాంటి వాళ్లు తమకు అవసరమైన సామగ్రిని తమతో తీసుకెళతారు. ఇందుకోసం ఎడ్లబండి, ట్రాక్టర్లు, వ్యాన్‌లమీద వెళుతూంటారు. కొన్ని ప్రాంతాలలో పడవల్లో కూడా ప్రయాణం చేస్తుంటారు.







## ఇలా ప్రయాణం చేయవచ్చా?

కింది చిత్రాలు చూడండి. వేటిలో ప్రయాణం చేస్తున్నారు? ఇలా ప్రయాణం చేయడంవల్ల ఏం జరగవచ్చు? ఆలోచించండి.













వీటిద్వారా మీరేం తెలుసుకున్నారో చెప్పండి. చిత్రాల్లో ఉన్న విధంగా ప్రయాణం చేయడం ప్రమాదకరం. ఇలాంటి ప్రయాణాలు చేయగూడదు.




## ఇప్పుడు మనం చూస్తున్న వాహనాలు గతంలో కూడా ఉండేవా?

ఇప్పుడు ఆటోలు, స్కూటర్లు, సైకిళ్లు, బస్సులు, రైళ్లు, విమానాలు, పడవలు మొదలయిన వాటిని ప్రయాణాలు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఇవి గతంలో కూడా ఉండేవా? ఇవి లేని కాలంలో ఎలా ప్రయాణం చేసేవారు? మీరు మీ ఊరిలోని పెద్దవారిని లేదా తాతయ్యను లేదా ముసలివాళ్లను, అమ్మమ్మను, నాన్నమ్మను ఇలా ఎవరినైనా అడగండి. వాళ్లు చిన్నతనంలో వాళ్లు ఎక్కడికైనా ప్రయాణించాలంటే ఎలా ప్రయాణం చేసేవారు? తెలుసుకొని చెప్పండి.



## మీరూ ఇలా చేయగలరా?



కొన్ని ఖాళీ అగ్గిపెట్టెలు తీసుకోండి. అగ్గిపెట్టెలన్నింటినీ ఒక దానితో ఒకటి దారంతోగాని తీగతో గాని కట్టండి. ప్రతి పెట్టెకూ ఇంజక్షన్ సీసా మూతకు ఉపయోగించే రబ్బరులను చక్రాలుగా బిగించండి. ముందున్న అగ్గిపెట్టెకు దారం కట్టి లాక్కుంటూ వెళ్ళండి. అగ్గిపెట్టె రైలుతో ఆటలు ఆడుకోండి. అగ్గిపెట్టెలతో కాకుండా ఇంకా వేటితో ఇలా తయారు చేసుకోవచ్చు? చేసి చూడండి.

## కీలక పదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ప్రయాణం | 2. | ప్రయాణ సాధనాలు | 3. | వాహనాలు |
| 4. | గాలిలో ప్రయాణించేవి | 5. | నీటిమీద ప్రయాణించేవి | 6. | నేలమీద ప్రయాణించేవి |
| 8. | ప్రయాణానికి జంతువులు | 7. | ప్రయాణాల్లో ప్రమాదాలు | 8. | గతంలోని ప్రయాణ సాధనాలు |

## మనం నేర్చుకున్నవి

★ ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతం వెళ్ళడానికి వాహనాలను ఉపయోగిస్తారు.


★ ప్రయాణానికి బస్సు, ఆటో, రైలు, విమానం, పడవ లాంటి సాధనాలను ఉపయోగిస్తారు.

★ ఎడ్లబండ్లు, గుర్రపుబండ్లను కూడా ప్రయాణానికి ఉపయోగిస్తారు. అలాగే ఒంటెలను, గాడిదలను, ఏనుగులను కూడా అక్కడక్కడ ప్రయాణానికి వాడుతున్నారు. అయితే వీటి వాడకం తగ్గింది.


★ ప్రయాణించే దూరం, అవసరాన్ని బట్టి వివిధ రకాల వాహనాలను ఉపయోగిస్తారు.

★ కిక్కిరిసిన వాహనాలలో, ఎక్కువమంది ఎక్కిన ఆటోలలో ప్రయాణించడం ప్రమాదకరం. అలాగే ప్రైవేటు వాహనాలైన జీపులు, ట్రాక్టర్లు, లారీలు మొదలయిన వాటిలో ప్రయాణం చేయగూడదు.





## ఇవి చేయండి



### విషయావగాహన

1. ప్రయాణం అంటే ఏమిటి? మీరు ఏయే వాహనాల్లో ప్రయాణించారు?

2. కింది వాహనాల పేర్లు చదవండి. వాటిని పట్టికలో రాయండి.

   లారీ, బస్సు, ఆటో, రైలు, ట్రాలీ ఆటో, విమానం, పడవ, గాడిద, గుర్రం, ఎడ్లబండి, హెలికాప్టర్, జీపు, గుర్రపు బండి, గాడిద, సైకిలు, రిక్షా, ఒంటె, ఏనుగు, ట్రాక్టర్.

| నేలమీద వెళ్లేవి | నీటి మీద వెళ్లేవి | గాలిలో వెళ్లేవి |
|---|---|---|
| | | |

3. సైకిల్‌కు, మోటర్ సైకిల్‌కు మధ్య పోలికలు, భేదాలు రాయండి.

4. ఏయే జంతువులను ప్రయాణం చేయడానికి ఉపయోగిస్తారు?

5. చిత్రాలు చూడండి.






చిత్రాల్లో చూపిన విధంగా ప్రయాణించడం ప్రమాదకరం. ఎందువల్లనంటే.......................

.........................................................................................................


.........................................................................................................

.........................................................................................................





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## బొమ్మలు గీయండి. రంగులు వేయండి.

1. మీకు నచ్చిన రెండు వాహనాల బొమ్మలు గీయండి. పేర్లు రాయండి.




## సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పని

1. ఆదివారంనాడు ఒక గంటసేపు మీ వీధిలో తిరిగిన వాహనాలను చూడండి. పట్టికలో రాయండి.

| తిరిగిన వాహనం పేరు | తిరిగినవాటి సంఖ్య |
|---|---|
| | |
| | |
| | |
| | |

◆ ఏ వాహనాలు ఎక్కువగా తిరిగాయి? ఏ వాహనాలు తక్కువగా తిరిగాయి?

2. బంకమట్టి, చొప్పబెండ్లు, అట్టముక్కలతో బస్సును / బండిని తయారుచేయండి. ప్రదర్శించండి.



## ప్రశంస

1. ప్రయాణానికి వాహనాలే కాకుండా, జంతువులు కూడా ఉపయోగపడుతున్నాయి కదా! వాటిపట్ల మనం ఎలా ఉండాలి?
2. మీ తరగతిలో బస్సు / బండి బొమ్మలు ఎవరు బాగా తయారు చేశారు? అవి మీకు ఎందుకు బాగా నచ్చాయి?



## ప్రశ్నించడం

1. గతంలో ప్రయాణించడానికి వేటిని ఉపయోగించేవారో తెలుసుకోడానికి అబ్దుల్లా తాతయ్య దగ్గరకు వెళ్లాడు. అబ్దుల్లా తాతయ్యను ఏమేమి ప్రశ్నలు అడిగి ఉండవచ్చు.



## నేనివి చేయగలను



| | | |
|---|---|---|
| 1. | మా ప్రాంతంలో ఏ ఏ వాహనాలు తిరుగుతున్నాయో చెప్పగల్గుతాను. | ఔను / కాదు |
| 2. | ప్రయాణసాధనాల గురించి వివరిస్తాను. వాటిని పట్టికలో రాస్తాను. | ఔను / కాదు |
| 3. | వాహనాల బొమ్మలు గీయగలుగుతాను. | ఔను / కాదు |
| 4. | ఏయే సందర్భాలలో ఏయే వాహనాలను ఉపయోగిస్తారో చెప్పగలను. | ఔను / కాదు |
| 5. | ప్రయాణానికి ఏయే జంతువులను ఉపయోగిస్తారో వివరించగలను. | ఔను / కాదు |
| 6. | ప్రయాణసాధనాలను గురించి ప్రశ్నలు అడగగలను. | ఔను / కాదు |



